ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 02.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 283 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఈఎస్‌పీఎన్ వన్డే టీమ్2025 కెప్టెన్‌గా రోహిత్ శర్మ.. 8

ఎగ్జిబిషన్ సొసైటీ ప్రపంచ స్థాయికి ఎదగాలి

చిన్న, మధ్య తరహా, చేతి వృత్తిదారులు వేదిక నుమాయిష్



- హైదరాబాదును అత్యంత సేఫ్ సిటీగా చేస్తాం
- మూసి పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ఘనంగా నుమాయిష్ ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: నుమాయిష్ హైదరాబాద్ నగరానికే కాదు, తెలంగాణ రాష్ట్రానికి ఒక పెద్ద ఉత్సవం అని, ప్రపంచీకరణ తర్వాత ప్రపంచం ఓ చిన్న గ్రామంగా మారిన నేపథ్యంలో ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ ప్రపంచ స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ నాంపల్లిలో నుమాయిష్(ఎగ్జిబిషన్)ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత పాలకులు ఎగ్జిబిషన్ సొసైటీని ప్రోత్సహిస్తామని అనేక హామీలు ఇచ్చారు కానీ, అమలు చేయలేదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం ఈ సొసైటీని పెద్ద ఎత్తున విస్తరింపజేయాలన్న పట్టుదలతో ఉన్నదని వివరించారు. సమాజానికి మేలు చేయాలన్న ఆలోచనతో ఉస్మానియా పట్టభద్రులు పబ్లిక్ గార్డెన్స్ లో మొదట 1938లో ఎగ్జిబిషన్స్ సొసైటీని ప్రారంభించారని వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కాటేజ్, చేతివృత్తుల ఉత్పత్తిదారులు దేశం నలుమూలల నుంచి ఇక్కడ వచ్చి నుమాయిష్‌లో అమ్మకానికి పెట్టేవారని, ఇది ఒక వ్యవస్థగా

...:: మిగతా 2లో



కేసీఆర్, హరీష్‌లను ఉరితీసినా తప్పులేదు

> నీటి హక్కుల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగిందని, నీటి హక్కుల కోసమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కానీ, గత పదేళ్ల మామా, అల్లుళ్ల పాలనలో రాష్ట్రానికి నీటి విషయంలో తీరని అన్యాయం జరిగిందని సీఎం తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలను వాడుకుంటే తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలిచి ఉండేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రానికి మామా, అల్లుడు తీవ్ర అన్యాయం చేశారు

- ఆదిత్యనాథ్ దాస్ ప్రాజెక్టులపై పదేళ్లు పని చేశారు
- ఆయన నాకు బంధువు కాదు
- దొంగతనం బయటపడుతుందనే హరీష్ విమర్శలు
- నదీజలాలపై అసెంబ్లీ వేదికగా చర్చకు రెడీ
- ప్రతిపక్ష నేత కేసీఆర్ చర్చలో పాల్గొనాలి
- కృష్ణా, గోదావరి జలాలను వాడుకుంటే అభివృద్ధి
- బీఆర్ఎస్ పై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- ప్రజాభవన్లో మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: నదీ జలాలు, పెండింగ్ ప్రాజెక్టుల పై ప్రజాభవన్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గురువారం సాయంత్రం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజెంటేషన్ అనంతరం ప్రజాభవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో పదేళ్లపాటు అధికారంలో కొనసాగిన కేసీఆర్ తీవ్ర ద్రోహం చేశారని ఆరోపించారు. రాష్ట్రానికి చేసిన ఘోరానికి కేసీఆర్ కు ప్రజలు శాశ్వత జల, రాజకీయ సమాధి కడతారని సీఎం అన్నారు. కేసీఆర్, హరీష్‌రావును నీళ్ల విషయంలో ఉరి తీసినా తప్పు లేదని, ఆదిత్యనాథ్ దాస్ ను సలహాదారుగా

...:: మిగతా 2లో



ఇరాన్‌లో జెన్‌జీ ఉద్యమం

ఇరాన్ సుప్రీమ్ నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీకి వ్యతిరేకంగా గతవారం రోజులుగా సాగుతున్న నిరసనలు నూతన సంవత్సరం నాడు హింసాత్మకంగా మారాయి. పలువురు నిరసనకారులతోపాటు ఓ భద్రతా సిబ్బంది ఈ ఘర్షణల్లో మరణించినట్లు తెలిసింది.

7



బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యక్తిపై దాడి

బంగ్లాదేశ్ లో తాజాగా మరో హిందూ వ్యక్తి పై మూక దాడి జరిగింది. ఈ దాడిలో సదరు వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. డిసెంబర్ 31న దేశంలోని షరియత్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది.

7



రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

- ప్రమాదాలను నివారించి, మరణాలను తగ్గించాలి
- ఆర్టీసీలో జీరో ప్రమాదాలే లక్ష్యంగా పని చేయాలి
- సంస్థ లాభాల్లోకి వచ్చేలా అందరం కృషి చేద్దాం
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రమాద రహిత డ్రైవర్లకు సన్మానం
- రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, తద్వారా ప్రమాదాలను నివారించి, మరణాలను తగ్గించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 26 వేల రోడ్డు ప్రమాదాలు,8 వేల మరణాలు సంభవిస్తుండగా, ప్రతి రోజూ 22 మంది ప్రాణాలు కోల్పోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా అధికారుల తలకు హెల్మెట్ తొడిగారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు పోస్టర్, వాహనాల స్టికర్,

...:: మిగతా 2లో

ఆరు రోజులు.. 1,350 కోట్లు



- రాష్ట్రంలో భారీగా మద్యం అమ్మకాలు
- ఫుల్లుగా తాగేసిన మద్యం బాబులు
- 30,31న రూ.750 కోట్ల విక్రయాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం
- 2,731 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: రాష్ట్రంలో డిసెంబర్ 25 నుంచి 31 వరకు ఆరు రోజులు రూ.1,350 కోట్ల మద్యం తాగేశారు. డిసెంబర్ 30, 31న రెండు రోజుల్లో భారీ ఎత్తున రూ.750 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మద్యం ప్రియులు ఎక్కడా తగ్గేదేలే అన్నట్లు ఫుల్‌గా

...:: మిగతా 2లో



రాష్ట్రంపై 'మంచు' దుప్పటి

- రాబోయే మూడ్రోజుల పాటు ఇదే పరిస్థితి
- చలి తీవ్రత తగ్గింది.. తూర్పు, ఆగ్నేయం నుంచి తేమ గాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: తెలంగాణ రాష్ట్రం పొగమంచుతో కప్పుకుంది. రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగి చలి తీవ్రత తగ్గిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నుంచి ఐదు డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగినట్లు తెలిపింది. తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమ గాలులు ప్రవేశించడం వల్ల దట్టమైన పొగమంచు కమ్మేస్తోందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు వెల్లడించారు. రాబోయే రెండు నుంచి మూడు రోజుల పాటు చలి ప్రభావం తక్కువగా ఉంటుందన్నారు. నాలుగో రోజు నుంచి ఉత్తర గాలులు ప్రారంభమై తెలంగాణలోని ఉత్తర, మధ్య జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. శీతాకాలంలో సాధారణంగా భూమి

...:: మిగతా 2లో



న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

నూతన సంవత్సరం వేడుకలు జరుపుకుంటున్న వేళ స్విట్జర్లాండ్‌లోని ఓ విలాసవంతమైన బార్‌లో బుధవారం అర్ధరాత్రి పేలుడు సంభవించి 40 మంది వరకు మరణించగా, మరో 100 మంది గాయపడ్డారు.

7



కొత్త కార్ల ఫాస్టాగ్‌కు కేవైవీ అక్కర్లేదు

కొత్త కార్లు, జీపులు, వ్యాన్లకు నో యువర్ వెహికల్ (కేవైవీ) ప్రాసెస్ లేకుండానే ఫాస్టాగ్‌ను జారీ చేయనున్నట్లు భారత జాతీయ రహదారుల అథారిటీ ప్రకటించింది. వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది.

7



జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా
- సీఎంను కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం
- మీడియా డైరీ ఆవిష్కరించిన సీఎం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, తన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను తన దృష్టికి తెస్తే తప్పకుండా వాటిని పరిష్కరిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం సచివాలయంలో

...:: మిగతా 2లో

కొత్త సంవత్సరం ధరల పిడుగు

- సిగరెట్, బీడీ, పాన్ మసాలాపై జీఎస్టీతో పాటు ఎక్సైజ్ సుంకం
- ఫిబ్రవరి 1 నుంచి అమలు
- కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పైనా రూ.111 పెంపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 1: కొత్త సంవత్సరం వేళ ప్రజలపై కేంద్రం ధరల బాంబు పేల్చింది. సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు పెరుగనున్నాయి. వాటిపై జీఎస్టీతోపాటు అదనపు సెస్ విధించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ధరలు అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై కొత్త సెస్సు విధించనున్నట్లు పేర్కొంది. కాగా, ఫిబ్రవరి 1 నుంచి

...:: మిగతా 2లో



రాష్ట్రీయం

ఎగ్జిబిషన్ సొసైటీ ప్రపంచ స్థాయికి ఎదగాలి

మొదటిపేజీ తరువాయి

మొదలైందని తెలిపారు. క్రమక్రమంగా ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిక్ గార్డెన్స్ నుంచి 1936లో ప్రస్తుతం నాంపల్లిలో ఉన్న ప్రాంతానికి మారిందని అన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని విద్యార్థుల చదువు, చేతివృత్తుల వారికి సహాయం అందించడం, ప్రధానంగా మహిళా సాధికారతను దృష్టిలో పెట్టుకుని కమలా పాలిటెక్నిక్ కళాశాలలు స్థాపించడం వంటి గొప్ప పనులు ఈ సొసైటీ చేయడం అభినందనీయం అన్నారు. లాభాపేక్ష లేకుండా పూర్తి నాణ్యతతో 19 విద్యాసంస్థలను సొసైటీ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు హైదరాబాద్ నగరంలో స్థిరపడడానికి ఆసక్తి చూపుతున్నారని, ఇక్కడ ఉన్న విద్య, వ్యాపారం కోసం వచ్చిన వారు ఇక్కడే స్థిరపడుతున్నారని, హైదరాబాద్ నగరం పెద్ద ఎత్తున విస్తరిస్తుందని డిప్యూటీ సీఎం వివరించారు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్ను అత్యంత సేఫ్ సిటీగా రూపొందించాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. కాలుష్యరహితంగా, 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరా, పూర్తి శాంతి భద్రతలతో కూడిన నగరంగా హైదరాబాదును రూపొందించే ఆలోచనలో ప్రజా ప్రభుత్వం ఉందని తెలిపారు. అందులో సొసైటీ సభ్యులు భాగం కావాలని విజ్ఞప్తి చేశారు. మూసి నదిలో మంచినీరు ప్రవహింపచేసి పునర్జీవనం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని, మూసి పరిసర ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్ మహానగరంలో తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. రాక్స్, లేక్స్‌పార్కులతో కూడిన హైదరాబాద్ ను భవిష్యత్తు తరాలకు భద్రంగా అందించాలని ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. నగరంలో బ్యాటరీ బస్సులను ప్రవేశ పెడుతున్నామని, ప్లాస్టిక్ రహిత నగరంగా హైదరాబాదును మార్చుతామని ఇటీవల సీఎం ప్రకటించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. నగరం లోపల ఉన్న కాలుష్య కారకమైన ఇండస్ట్రియల్ పార్కులను ఔటర్ రింగ్ రోడ్డు బయటకు తరలించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

మొదటిపేజీ తరువాయి

విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అవగాహన బుక్స్ రిలీజ్ చేశారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ లో రావడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం అని, రవాణా శాఖ అధికారులు ప్రతి పాఠశాలకు వెళ్లి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో రోడ్డు నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నుండి ఒక్క ప్రాణాన్ని కాపాడినా జీవితం సార్థకమవుతుందన్నారు. ఈ సంవత్సరం సడక్ సురక్ష జీవన్ సురక్షా నినాదంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్నామని వెల్లడించారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎమర్జెన్సీపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బాక్స్ స్పాట్స్ తొలగించి ప్రమాదాలను నివారించాలని అధికారులకు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా డ్రైవింగ్ చేస్తూ, ఒక్క ప్రమాదం కూడా జరగని డ్రైవర్లను అభినందించి సత్కరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2026 లో ఆర్టీసీ పాత బకాయిలు పోయి మరింత లాభాల్లోకి వచ్చేలా అందరం కృషి చేద్దామని వెల్లడించారు. ఆర్టీసీ ప్రమాదాలను జీరో కి తగ్గించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివలింగయ్య, స్టేట్ ఆర్టీఏ మెంబర్ నవీన్, జిల్లా ఆర్టీఏ సురేష్‌లాల్ పాల్గొన్నారు.

తొలి రోజే కేటీఆర్ గోబెల్స్‌ప్రచారం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 1: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. నూతన సంవత్సరం తొలి రోజునే కేటీఆర్ గోబెల్స్ ప్రచారాన్ని మొదలు పెట్టారని విమర్శించారు. ఓవైపు హరీష్ రావు, మరోవైపు కేటీఆర్ కలిసి కాంగ్రెస ప్రభుత్వం, ప్రజా పాలనపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్ రావు.. కృష్ణా, గోదావరి నదీ జలాలు, పాలమూరు,రంగారెడ్డి ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని, కేటీఆర్ వచ్చి రైతులకు యూరియా సరఫరాపైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై వాస్తవాలు మాట్లాడాలని.. తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు భూస్థాపితం చేశారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించి గుండు సున్నా తెచ్చుకుందని ఎంపీ చామల ఎద్దేవా చేశారు. రైతులకు యూరియా కోసం ధర్నాలు చేశామని, కేంద్ర మంత్రి నడ్డాతో మాట్లాడి యూరియా తెప్పించామన్నారు. 2024-25 సంవత్సరానికి వానాకాలం పంటకు 9.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణ రాష్ట్రానికి తెప్పించామన్నారు. యాసంగికి 10.41 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను తీసుకువచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఈ స్థాయిలో ఎప్పుడూ యూరియా తేలేదన్నారు. 2025-26 వానాకాలం పంటకు 9.79 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తెచ్చామని, యూరియాను తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా ఫెయిల్ కాలేదన్నారు. లెక్కలు ప్రజలు తెలుసుకోలేరని, కేటీఆర్ జనవరి 1వ తేదీ నుంచే అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పుడు సమాచారంతో, తప్పుడు మాటలతో తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టొద్దన్నారు.

ఆరు రోజులు.. 1,350 కోట్లు

మొదటిపేజీ తరువాయి



తాగేశారు. డిసెంబర్ 31న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ స్థాయిలో అమ్మకాలు జరిగాయి. మధ్యాహ్నం నుంచే మందుబాబులు దుకాణాల వద్ద మద్యం కోసం క్యూ కట్టారు. గతేడాది కంటే అధికంగా లిక్కర్అమ్మకాలు జరిగాయి.

ప్రభుత్వ ఖజానాకు కిక్కు..

కొత్త సంవత్సరం రాష్ట్ర ఖజానాకు కిక్కిచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కనివినీ ఎరగని రీతిలో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. ఆరు రోజుల్లోనే రూ.1,350 కోట్ల విలువైన మద్యం తాగేశారు. గత మూడు రోజుల్లోనే వెయ్యి కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మూడు రోజుల్లో 8.30 లక్షల లిక్కర్ కేసులు, 7.78 లక్షల బీర్ల కేసులు విక్రయించారు. నూతన సంవత్సరం సందర్భంగా వైన్ షాప్‌ల వద్ద జోరుగా మద్యం అమ్మకాలు జరిగాయి. గతం కంటే ఎక్కువగా మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ వర్గాలు చెబుతున్నాయి. పలుచోట్ల రెట్టింపు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. గత ఏడాది రాష్ట్రంలో మద్యం అమ్మకాలు 2024 డిసెంబరులో రూ.3,800 కోట్లు, 2023 డిసెంబరులో రూ.4,297 కోట్లు మాత్రమే. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి రూ.1,300 కోట్లకుపైగా అధికంగా మద్యం విక్రయాలు జరిగాయి..12గంటల వరకు మద్యం దుకాణాలు, ఒంటి గంట వరకు బార్లు తెరిచి ఉంచేందుకు ఎక్సైజ్‌శాఖ అనుమతి ఇవ్వడంతో అమ్మకాలు పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్త వ్యాపారులకు తొలినెలలోనే మంచి ఆదాయం రావడంతో ఆనందం వ్యక్తమవుతోంది.

2,731 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

న్యూ ఇయర్ సంబరాలు అంబరాన్నంటిన వేళ శాంతి భద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. తాగి వాహనాలు నడుపుతున్న వారి కోసం హైదరాబాద్ వ్యాప్తంగా విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. పోలీసులను దూరం నుంచే చూసి పలువురు వెనక్కి తిరిగి పారిపోగా పలువురు మందు బాబులు చిక్కినట్లు పోలీసులు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించి వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. 3 కమిషనరేట్ల పరిధిలో 2,731 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,198, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 928, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 605 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లుగా పోలీసులు వివరించారు.



రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కోసం 5 మ్యాచ్‌ల వన్డేలు, ట్రై/క్వాడ్రిలేటరల్ సిరీస్‌లు నిర్వహించాలి. 3 మ్యాచ్‌ల సిరీస్‌లే ఎందుకు నిర్వహిస్తున్నారు.? రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆట చూడాలంటే వన్డేల్లో అలాంటి సిరీస్‌లు అవసరం. ప్రస్తుతం రోహిత్, కోహ్లీ మంచి ఫామ్‌లో ఉన్నారు.

- భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్



కేసీఆర్, హరీష్‌లను ఉరితీసినా తప్పులేదు

మొదటిపేజీ తరువాయి

నియమించడంపై విమర్శలు చేస్తున్నాని, ఆదిత్యనాథ్ దాస్ తెలంగాణ ప్రాజెక్టులపై పదేళ్లు పని చేశారని అన్నారు. అన్ని ప్రాజెక్టులపైన ఆయనకు పూర్తి అవగాహన ఉందని, ఆయన నాకు బంధువు కాదని సీఎం అన్నారు. తమ దొంగతనం బయట పడుతుందనే ఆదిత్యనాథ్ దాస్ పైన హరీష్‌రావు విమర్శలు చేస్తున్నారని అన్నారు. నదీ జలాల విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారంటూ సీఎం అభినందించారు.

అసెంబ్లీలో చర్చ పెడదాం రండి

నదీ జలాలు, పెండింగ్‌ప్రాజెక్టులపై అసెంబ్లీ వేదికగా చర్చకు తాము రెడీగా ఉన్నామని, ఈ చర్చలో ప్రధాన ప్రతిపక్షనేత కేసీఆర్ పాల్గొనాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. చర్చ సజావుగా సాగేందుకు సభా నాయకుడిగా తాను హామీ ఇస్తున్నానన్నారు. కృష్ణానది జలాల విషయంలో కేసీఆర్, హారీశ్‌రావులు చేసిన అన్యాయం బయటపడుతుందన్న దుగ్ధతో అబద్దాలు మాట్లాడుతున్నారంటూ ధ్వజమెత్తారు. ఎవరు ఏ లేఖ రాశారు?, ఎప్పుడు రాశారో అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరిస్తామన్నారు. కేసీఆర్, హరీశ్‌రావులు ఇటీవల నదీ జలాల విషయంలో చేసిన ఆరోపణలన్ని తప్పు అని ఆధారాలతో (వారు రాసిన లేఖలు) రుజువు చేస్తామని సీఎం తెలిపారు.

కేసీఆర్‌సంతకంతో ఏపీకి లాభం..

నీళ్ల కోసం ఉమ్మడి రాష్ట్రంలో పీజేఆర్ అప్పటి ప్రభుత్వాన్ని నిలదీశారని సీఎం రేవంత్‌తెలిపారు. గతంలో నీళ్ల విషయంలో ఎన్నో పొరపాట్లు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటూ వెళ్తున్నామన్నారు. ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయని, అయితే రాష్ట్రం విడిపోయినప్పుడు ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు అని చెప్పారని, కేసీఆర్ పెట్టిన సంతకం ఏపీకి లాభదాయకంగా మారిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ 299 టీఎంసీలు చాలు అని అంగీకరిస్తూ పదేళ్ల కాలానికి కేసీఆర్ సంతకం చేశారని సీఎం అన్నారు. అంటే ఏపీకి 66 శాతం నీళ్లు శాశ్వత హక్కు ఇచ్చేలా కేసీఆర్ సంతకం పెట్టారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుంచి శ్రీశైలంకు మార్చడానికి మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విషయం బయట పడుతుందనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని ధ్వజమెత్తారు. ఈ అంశంపైన ప్రభుత్వం విచారణ జరుపుతుందన్నారు. అందుకే హరీష్ రావు గత రెండు రోజుల నుంచి రంగారెడ్డి ప్రాజెక్టును మరిచి బనకచర్ల పైన మాట్లాడుతున్నాడని సీఎం తెలిపారు. ఎవరి లాభం కోసం పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలంకు మార్చారంటూ కేసీఆర్‌ను సీఎం నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టు పనులకు నిధులు వెచ్చించకుండా కమీషన్లు వచ్చే మోటార్లు, పంపులకు కేటాయింపులు నెరిపారని సీఎం ఆరోపించారు. శ్రీశైలం ప్రాజెక్టు ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉందని, జూరాల ప్రాజెక్టు తెలంగాణలో ఉందని ఇక్కడి నుంచి నీటిని తరలించేందుకు నిర్ణయిస్తే మన భూభాగంలో ఉన్న నీటిని తరలిస్తుంటే ఎవరు ఏమీ చేయలేరన్నారు. కానీ కేసీఆర్‌అలా కాకుండా మొత్తం నీటిని ఏపీకి ధారాదత్తం చేశాడని ఆరోపించారు. ఈ సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీ లు, ఎంఎల్సీ లు, ఎంఎల్ఏలు, కార్పొరేషన్ల చైర్మన్లు,ఇరిగేషన్ శాఖ అధికారులు హాజరయ్యారు.

కేసీఆర్, హరీశ్ రావు అవాస్తవాలు మాట్లాడుతున్నారు

పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు పనులు తాము 90 శాతం పూర్తి చేస్తే కాంగ్రెస్ సర్కార్ వచ్చినాక పూర్తిగా విస్మరించిందన్న కేసీఆర్ వ్యాఖ్యలను ఉత్తమ్ ఖండించారు. కేసీఆర్, హరీశ్ రావు అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కావడానికి రూ.80 వేల కోట్లు అవసరం అని.. అలాంటిది ఈ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు కేసీఆర్ ప్రభుత్వం చెప్పింది. అయితే రూ.80 వేల కోట్ల ప్రాజెక్టుపై రూ. 27 వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పూర్తయినట్టా అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఎకరాకి కూడా నీళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే రూ.7 వేల కోట్లు ఖర్చు చేశామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కృష్ణా జలాశయాలలో 763 టీయంసీలు తెలంగాణాకు కేటాయించాల్సిందేనని, .పాలమూరు,రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుండి శ్రీశైలం ఎందుకు మార్చారని ప్రశ్నించారు. పీఆర్ఎల్ఐసీ 90% పూర్తి అయిందనడం వాస్తవం కాదని, ప్రాజెక్టును పూర్తి చేయాలంటే 80 వేల పైచిలుకు వ్యయం అవుతుందని అన్నారు. 2015 లో ఈ ప్రాజెక్టును పూర్తికి 35 వేల కోట్లతో అంచనా వేశారని, 2022 లో సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్లో భూసేకరణ, కాలువల నిర్మాణం లేకుండానే 55 వేల కోట్లకు పెంచారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పీఆర్ఎల్ఐసీ మీద పెట్టిన ఖర్చు 27 వేల కోట్లు మాత్రమే అని తెలిపారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిన మొత్తం 7 వేల కోట్లని, జూరాల వద్దే కొనసాగితే ఇంత వ్యయం ఉండదని, 90 టీఎంసీల నీటితో పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికి కట్టుబడి ఉన్నామని ఉత్తమ్‌తెలిపారు. జలాశయాలలో తెలంగాణ వాటా పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని, కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్లో వాదనలు గట్టిగా వినిపిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంపై 'మంచు' దుప్పటి

మొదటిపేజీ తరువాయి

రిరేడియేటింగ్ క్రియేట్ చేస్తుంటుందని, అలాగే ఇటీవల మేఘాలు లేకుండా ఉండటం, గాలిలో తేమ లేకపోవడం వల్ల చలి ఎక్కువగా ఉందని వాతావరణ అధికారి శ్రీనివాస్ రావు చెప్పారు. దీనికి తోడు ఉత్తర రాష్ట్రాల నుంచి చలి ఉండటం వల్ల డిసెంబరు నెల మొత్తం చాలా తక్కువ ఉష్ణోగ్రతల్లో ఉండటం జరిగిందన్నారు. గత రెండు రోజుల నుంచి కూడా ఈ గాలుల ప్యాటెర్న్ మారిందన్న ఆయన ఉత్తర, ఈశాన్య దిశల నుంచి కాకుండా ప్రస్తుతం తూర్పు, ఆగ్నేయం నుంచి ఈ గాలులు ప్రవేశిస్తున్నాయని తెలిపారు.

తీవ్ర స్థాయిలో పొగమంచు..

తూర్పు, ఆగ్నేయం గాలుల వల్ల తేమ ప్రవేశించడం జరుగుతుందని, తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు ఈ తేమ ప్రవేశించడం వల్ల సాచురేషన్ అంటే వంద శాతానికి చేరుకోవడంతో ఉదయం పొగమంచు తీవ్ర స్థాయిలో ఉంటుందని వాతావరణ అధికారి తెలిపారు. ఇది భూమి నుంచి తక్కువ ఎత్తులో ఏర్పడుతుందని, తేమ వంద శాతం ఉండటం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తెలిపారు. మనం రాష్ట్రంలో ఈరోజు చూసినట్లయితే కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 5 డిగ్రీలు పెరిగాయని అన్నారు. ఇదే సమయంలో తేమ కూడా చేరడంతో రాష్ట్రవ్యాప్తంగా పొగమంచు కూడా ఎక్కువగా వ్యాపించిందని చెప్పారు. ఈ పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాలో ఉందన్నారు. సాధారణంగా చూస్తే తేమ శాతం శీతాకాలంలో చాలా తక్కువగా ఉంటుందన్నారు. గురువారం శంషాబాద్లో 50 మీటర్ల ఎత్తు వరకు పొగమంచు కురిసిందని అధికారులు తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మొదటిపేజీ తరువాయి

సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. అలాగే యూనియన్ రూపొందించిన 2026 మీడియా డైరీని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేసింది. ఈ సందర్భంలో జర్నలిస్టులకు నూతన సంవత్సర కానుకగా సంక్షేమ పథకాలు అందించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ ముఖ్యమంత్రిని కోరగా, ఆయన పై విధంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, కార్యదర్శులు వి.యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి యం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, అజిత, చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియుద్దీన్, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరీష్‌లు ఉన్నారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని యూనియన్ ప్రతినిధి బృందం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది.

కొత్త సంవత్సరం ధరల పిడుగు

మొదటిపేజీ తరువాయి


పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ విధిస్తారు. బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉంటుంది. అలాగే పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం కూడా విధిస్తారు. పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్సు ఉంటుంది. గతంలో ఉన్న కంపన్‌సేషన్ సెస్సు స్థానంలో ఈ కొత్త సెస్సు అమలు చేస్తారు. మరోవైపు చూయింగ్ టొబాకో, జర్దా సెంటెడ్ టొబాకో, గుట్కా ప్యాకింగ్ యంత్రాలు (సామర్థ్య నిర్ధారణ, సుంకం వసూలు) నియమాలను కూడా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడిచింది. దీంతో వాటి తయారీ మెషిన్స్‌పై కూడా అదనపు పన్నులు ఉంటాయి. అయితే పాన్ మసాలా తయారీపై కొత్తగా ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్, పొగాకుపై ఎక్సైజ్ సుంకాన్ని విధించడానికి అనుమతించే రెండు బిల్లులను డిసెంబర్‌లో పార్లమెంట్ ఆమోదించింది.

కమర్షియల్‌ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.111 పెంపు

వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఏకంగా రూ.111 పెంచేశాయి. గురువారం నుంచి కొత్త ధర అమల్లోకి వచ్చింది. గత ఏడాది జూన్ తర్వాత ఇంత భారీస్థాయిలో వాణిజ్య సిలిండర్ ధర పెరగడం ఇదే మొదటిసారి. అయితే 14.2 కిలోల గృహోపయోగ వంట గ్యాస్ ధరలో మాత్రం ఎటువంటి మార్పులు చేయలేదు. డిసెంబర్ 1న సిలిండర్‌పై రూ. 15.50 తగ్గించగా అంతకుముందు నెల సిలిండర్‌పై రూ. 5 తగ్గించాయి. ఢిల్లీలో ప్రస్తుతం వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1,580.50 నుంచి రూ.1,691.50కి చేరుకుంది. వాణిజ్య సిలిండర్ ధరలు ఒక్కో నగరంలో ఒక్కో తీరున ఉన్నాయి. కాగా, దీంతోపాటు 5కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ(ఎఫ్‌టీఎల్) సిలిండర్ ధర కూడా గురువారం నుంచి రూ. 27 చొప్పున పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎటువంటి మార్పులు లేవు. చివరిసారి గత ఏడాది మార్చిలో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.2 చొప్పున చమురు సంస్థలు తగ్గించాయి.

రిటైర్మెంట్ వయస్సు 64 ఏళ్లకు పెంపు యోచన?

- ప్రభుత్వ ఉద్యోగులకు భారీ పిడుగు
- రెండు మూడు నెలల్లో అధికారిక ప్రకటన?
- భారీగా పదవీ విరమణ పొందనున్న ఉద్యోగులు
- రిటైర్మెంట్‌బెనిఫిట్స్‌చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం



ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ, జనవరి 1: తెలంగాణలో ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 సంవత్సరాలు కాగా, దాన్ని 64 ఏళ్లకు పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సచివాలయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి లేదా రెండు మూడు నెలల్లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.గతంలో రిటైర్మెంట్ వయస్సును 65 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మళ్లీ మూడు సంవత్సరాల పెంపుపై చర్చ జరగడం అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 3,56,135 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, డైలీ వేజ్, ఎన్ఎంఆర్, గౌరవ వేతన ఉద్యోగులు కలిపి సుమారు 4 లక్షల మంది ప్రభుత్వ సేవల్లో కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా, 2025 జూన్‌లో జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఉద్యోగులకు సర్వీస్ పొడిగింపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఇప్పుడు మళ్లీ రిటైర్మెంట్ వయస్సు పెంపుపై ప్రతిపాదనలు రావడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. రిటైర్మెంట్ వయస్సు పెంపు వెనుక అసలు కారణం ప్రభుత్వ ఆర్థిక అశక్తతేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024 నుంచి రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులకు ఇప్పటికీ బెనిఫిట్స్ చెల్లించలేదు. రూ.10 వేల కోట్లకు పైగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలు ఉన్నట్లు అంచనా. చెల్లింపులు రాక మాజీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకా దేశంలోనే అత్యధికంగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం, బిల్లుల బకాయిలు, పీఆర్సీ అమలు కాకపోవడం వంటి సమస్యలు ప్రభుత్వ ఉద్యోగులను వేధిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారీ సంఖ్యలో రిటైర్మెంట్‌కు సిద్ధమవుతున్న ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించలేని పరిస్థితి ప్రభుత్వాన్ని రిటైర్మెంట్ వయస్సు పెంపు వైపు నడిపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవ్వడానికి చిల్లిగవ్వ లేదని ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగుల హక్కుల విషయంలో విఫలమవుతోందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రిటైర్మెంట్ వయస్సు పెంపు తాత్కాలిక ఊరటనిచ్చినా, ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమేనని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

రాజకీయం





ముఖ్యమంత్రికి పలువురి శుభాకాంక్షలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 1: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ. కర్ణన్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను హైదరాబాద్ లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక కూడా పాల్గొన్నారు. అదే విధంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జోనల్ కమిషనర్‌లతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సచివాలయంలో కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌లు, జోనల్ కమిషనర్‌లు, విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కమిషనర్ ఆర్వీ కర్ణన్ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్‌లు, జోనల్ కమిషనర్‌లు, చీఫ్ ఇంజనీర్‌లు, విజిలెన్స్ అధికారులు, ఫైనాన్షియల్ అడ్వైజర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి దంపతులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నగర అభివృద్ధి, కార్మిక సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రితో స్వల్పంగా చర్చించారు.

జర్నలిస్టుల సమస్యపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం

- మాజీ మంత్రి హరీష్ రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 1: జర్నలిస్టుల అక్రిడిటేషన్ సమస్యపై అసెంబ్లీలో ప్రశ్నిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ మేరకు టీయూడబ్ల్యూజే ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌లో హరీష్ రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, గతంలో అమల్లో ఉన్న జీవో 239 ప్రకారం సుమారు 23 వేల మందికి అక్రిడిటేషన్ కార్డులు లభించేవని, అయితే నూతన జీవో 252 అమలుతో దాదాపు 13 వేల మంది జర్నలిస్టులు కార్డులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డెస్క్ జర్నలిస్టులు, బ్యూరో జర్నలిస్టులంటూ విభజించి రెండు కార్డుల విధానాన్ని ప్రవేశపెట్టడం సరికాదని, దీని వల్ల జర్నలిస్టుల మధ్య విభేదాలు ఏర్పడతాయని తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాను గౌరవించాల్సింది పోయి, వారిని అణిచివేసేలా నిబంధనలు తీసుకురావడం దుర్మార్గం" అని మండిపడ్డారు. డెస్క్ జర్నలిస్టులకు వేరు, రిపోర్టర్లకు వేరు అంటూ రెండు కార్డుల విధానం తీసుకురావడం ద్వారా జర్నలిస్టుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. వార్తను ప్రజల వరకు చేర్చడంలో డెస్క్ జర్నలిస్టుల పాత్ర కూడా ఎంతో కీలకమని, అలాంటి వారికి అక్రిడిటేషన్ ఇవ్వకుండా కేవలం గుర్తింపు కార్డులకే పరిమితం చేయడం అవమానకరమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా 23 వేల మందికి అక్రిడిటేషన్లు ఇచ్చామని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంఖ్యను 13 వేలకు తగ్గించాలనుకోవడం ద్వారా దాదాపు 10 వేల మంది జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నట్లు అవుతుందని తెలిపారు. కొత్త జీవో వల్ల జర్నలిస్టులు హెల్త్ కార్డులు, బస్ పాస్ వంటి సౌకర్యాలను కోల్పోయే ప్రమాదం ఉందని, జర్నలిస్టుల ఆరోగ్యం, ప్రయాణ సౌకర్యాల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గతంలో జర్నలిస్టులకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించి, ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేదని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని, అందుకే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులను కంటికి రెప్పలా కాపాడిందని చెప్పారు. కరోనా సమయంలో కూడా జర్నలిస్టులకు ఆర్థిక సాయం అందించి, వారి కుటుంబాలకు అండగా నిలిచిందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ జీవోపై ప్రభుత్వాన్ని తప్పకుండా ప్రశ్నిస్తానని, జీవో 252 సవరణ కోసం టీయూడబ్ల్యూజే చేస్తున్న పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని హరీష్ రావు హామీ ఇచ్చారు. హరీష్ రావును కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, కోశాధికారి పి.యోగనంద్, తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి యార నవీన్ కుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, చిన్నపత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్, హైదరాబాద్ నగర అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్ తదితరులు ఉన్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 1: శాసనసభలో ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలనుకుంటే, ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు కూడా సమాన అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంటరీ సంప్రదాయాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తోందని విమర్శించారు. నదీ జలాలపై అవగాహన లేని ముఖ్యమంత్రి మాకు ఉపన్యాసాలు ఇస్తారా? అంటూ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మేము మీ దగ్గర ఏమి నేర్చుకోవాలి? చెక్‌డ్యాంలను ఎలా ఫెయిల్ చేయాలో నేర్పిస్తారా? మేడిగడ్డను ఎలా పేల్చారో చెబుతారా? సుంకిశాల ఎలా కూల్చారో చూపిస్తారా? వట్టెం పంప్ హౌస్‌ను ఎలా ముంచారో వివరిస్తారా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు ఉన్న హక్కులన్నింటినీ కేఆర్ఎంబీకి ఎలా ధారాదత్తం చేశారో చెప్పబోతున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఒక్క ఎకరానికైనా అదనంగా నీళ్లు అందించిందా? ఒక్క చెరువును బాగు చేసిందా? ఒక్క కాలువను మరమ్మత్తు చేసిందా? అంటూ వరుస ప్రశ్నలు సంధించారు. సభలో సమాన హక్కులు ఇవ్వాలని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్‌కు కూడా అవకాశం కల్పించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సమయంలో ఇదే కాంగ్రెస్ పార్టీ సభను బాయ్‌కాట్ చేసి, ఇది పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని ఆరోపించిందని గుర్తు చేశారు.



చిక్కడపల్లి లింక్ బ్రిడ్జి ప్రారంభోత్సవం నేడే

- ప్రారంభించనున్న జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 1 : అశోక్ నగర్ నుంచి దోమలగూడ, హుస్సేన్‌సాగర్ నాలా లింక్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. ఈ లింక్ బ్రిడ్జిని నేడు జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి ప్రారంభించనున్నారు. చిక్కడపల్లి నుంచి అశోక్ నగర్, దోమలగూడను కలిపే లింక్ బ్రిడ్జి మీదుగా దోమలగూడ నుంచి లిబర్టీ జీహెచ్ఎంసీ ఆఫీస్ వరకు ఈ బ్రిడ్జి కొనసాగనుంది. 2కిలో మీటర్ల వరకు విస్తరించిన ఉన్న ఈ బ్రిడ్జిపై వెళ్తే కేవలం 10 నిమిషాల్లో లిబర్టీకి చేరుకోవచ్చు.

ఐక్యతకు ప్రతీక.. జేపీ దర్గా ఫాతేహా

- హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి
- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు, మీడియా ప్రతినిధులు




ప్రతినక్షం, షాద్‌నగర్, జనవరి 1: మతాల ఐక్యతకు ప్రతీకగా.. అన్ని మతాల సంప్రదాయాలను ఒకే చోట ఆవిష్కరించే వేదికగా నిలిచిన కొత్తూరు మండలం జహంగీర్ పేరు దర్గాలో ముజావర్లు ఉర్సు ఉత్సవాలకు ముందు నిర్వహించే పతేహా కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సర తొలిదినం, మరో వైపు ఉర్సు ఉత్సవాల ప్రారంభ సమయం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కేపీ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాధిక్, ఆల్ ఇండియా కృష్ణ మహేష్ ప్రజా సేన అధ్యక్షుడు ఎండి ఖాదర్ గోరి, ఎమ్మెస్ సత్యనారాయణ, మిట్టు నాయక్, ఎన్ని మూల నర్వ సర్పంచ్ గోపాల్, తస్లీమ్ భాయ్, రషీద్ బాయ్, ఖాలెద్ బాయ్, షాహిర్ బాయ్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో బాబాకు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

జహంగీర్ పీర్ దర్గా ఒక పవిత్ర పుణ్యస్థలం
టాలీవుడ్ సినీ నటుడు అలీ
సతి సమేతంగా ఫతేహాకు హాజరు

మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సందర్శించే ఒక పవిత్ర పుణ్యస్థలం జహంగీర్ పీర్ దర్గా అని సినీ నటుడు అలీ అన్నారు. దర్గాలో జరుగుతున్న ఫతేహా ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం ఆయన దర్గాను సందర్శించారు. సతీపుత్ర సమేతంగా హాజరైన ఆయన దటీలు కప్పి ఆశీస్సులను తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పలుమార్లు దర్గాను సందర్శించానని, ఇక్కడికి వస్తే ఎంతో ప్రశాంతంగా ఉంటుందని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఆయన అన్నారు. జనవరి 15 నుంచి ప్రారంభం కాబోయే జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అలీకి ఘన స్వాగతం పలికారు.



జర్నలిస్టుల సంక్షేమానికి కృషి: సీఎం రేవంత్

- హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 1: హైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2026 డైరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సచివాలయంలోని ఆయన కార్యాలయంలో గురువారం సీఎం రేవంత్ ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి, రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. జర్నలిస్టులను అన్ని విధాల ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ .రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లిబాపూరావు, ఈసీ సభ్యులు ఎన్ .ఉమాదేవి, మర్యాద రమాదేవి, రాజేశ్వరి కళ్యాణం, శంకర్ సిగ, ముత్యాల సత్తిబాబు, నాగరాజు వనం, ఎన్. శ్రీనివాసరెడ్డి ,అశోక్ దయ్యాల, అమిత్ బట్టు సహా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఆర్. రవి కాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ కుమార్ రెడ్డి, రమేష్ వరికుప్పల మొక్కను అందజేసి సత్కరించారు.

పనితీరు, సేవలను మెరుగుపరుచుకోవాలి

- కార్మికశాఖ అధికారులకు మంత్రి వివేక్ ఆదేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 1 : కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గురువారం సచివాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కార్మిక, ఉపాధి, ఫ్యాక్టరీలు, ఈఎస్ఐ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి పనితీరు, సేవలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. శాఖల వారీగా సమీక్షించిన మంత్రి, రాబోయే ఏడాదికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో కృత్రిమ మేధస్సు ఆధారిత కోర్సులు సహా కొత్త నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించాలని సూచించారు. యువత ఉపాధి అవకాశాలు పెంచేలా అన్ని కొత్త కోర్సులు ప్రస్తుతంతో పాటు భవిష్యత్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన డా. వివేక్ వెంకటస్వామి, పరిశ్రమల ప్రమాదాలను నివారించేందుకు ఫ్యాక్టరీల శాఖ భద్రతా ప్రమాణాలు, సన్నద్ధతను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. సిగాచీ ఘటన వంటి సంఘటనలను ప్రస్తావిస్తూ, కార్మికుల భద్రత, సంక్షేమంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.అదేవిధంగా ఈఎస్ఐ శాఖ పనితీరును కూడా సమీక్షించిన మంత్రి, ఇన్స్యూర్డ్ పర్సన్స్ కు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ శాఖల అధికారులు సచివాలయంలోని మంత్రి ని కలిశారు. మంత్రి శుభాకాంక్షలను స్వీకరిస్తూ, అధిక బాధ్యత, నిబద్ధత తో పనిచేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానా కిషోర్, ఉపాధి,శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి



ప్రతిపక్షం, రంగారెడ్డి, జనవరి 1: నూతన సంవత్సరం పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.



ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 1: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను సురంగల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు చించల్ పేట లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహ స్వామి లడ్డూ ప్రసాదం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు అందజేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలసిన వారిలో సురంగల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజు, విక్రమ్ రెడ్డి, యాదగిరి చారి, సందీప్ ఉన్నారు.



దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాలి

- తెలంగాణ ప్రభుత్వ న్యూఢిల్లీ సలహాదారులు జితేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 01: తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని, దేవాలయాలను అభివృద్ధి చేసుకున్నప్పుడే మానవుడికి మనశాంతి, ప్రశాంతత లభిస్తుందని తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ రిప్రజెంటేటివ్ స్పోర్ట్స్ ఆఫైర్స్ న్యూఢిల్లీ సలహాదారులు జితేందర్ రెడ్డి అన్నారు. గురువారం కొత్త సంవత్సరంను పురస్కరించుకోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడి వెంకటేశ్వరస్వామిని జితేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులతో కలిసి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లక్ష్మికాంత్ రెడ్డి వేదపండితులు ఆయనకు ఘన స్వాగతం వలికారు.ఈ సందర్భంగా ఆలయంలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు, మహామంగళ హారతి సమర్పించారు. అనంతరం జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలలో ఉన్న దేవాలయాలు అభివృద్ధి చెంది నప్పుడే ప్రజలు సనాతన ధర్మంతో పాటు ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో నడిచే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో ఉన్న దేవాలయాలను సనాతన ధర్మంతో అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, జగన్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



తెలంగాణను సాధించిన మహనీయుడిని కసబ్‌తో పోల్చిన నీకు సంస్కారం, మర్యాద అనే పదాలకు అర్థం కూడా తెలియదు. సభకు వస్తే కేసీఆర్‌ను అవమానించబోమని చెబుతూనే కసబ్‌తో పోల్చుతావా?'. రేవంత్‌కు బచావత్ ట్రిబ్యునల్‌కు, బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు తేడా తెలియదన్న విషయం ఈరోజు వెల్లడైంది.
- మాజీ మంత్రి హరీశ్ రావు

ఓపెన్ వాయిస్

బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుదీర్ఘ విరామం తర్వాత తనదైన శైలిలో మాట్లాడారు. పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడిన తీరు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండానే, అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, ముఖ్యంగా కృష్ణా జలాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. పాలనాపరమైన వైఫల్యాలపై కేసీఆర్ చేసిన విమర్శలు గంభీరంగా ఉండటమే కాకుండా, తెలంగాణ అస్తిత్వానికి సంబంధించిన అంశాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎక్కడా ఉచ్చరించకుండానే, కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల రైతులకు, సాధారణ ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ఆయన సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కేసీఆర్ రంగంలోకి దిగడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. 14 ఏళ్ల పోరాటం. పదేళ్ల అధికారం. రెండేళ్ల ప్రతిపక్ష పాత్ర. నాడు ఉద్యమ నాయకుడిగా అయినా.. తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా.. కేసీఆర్ఫాంహౌస్‌లో ఉన్నా, తెలంగాణ భవన్‌కు వచ్చినా హాట్ టాపికే. అసెంబ్లీకి అటెండ్ అయితే అందరిలో ఆసక్తి. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్ కేసీఆర్ మీడియా ముందుకు వచ్చారు. కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై కాంగ్రెస్ సర్కార్ తీరును తూర్పార బట్టారు. ఇక పోరు బాటే అంటూ హెచ్చరించారు. ఆ తర్వాత వారం రోజుల్లోనే అసెంబ్లీ మొదలైంది. మొదటి రోజు సమావేశాలకు కేసీఆర్అటెండ్ అయ్యారు. కేసీఆర్ దగ్గరికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పలకరించారు. ఆ తర్వాత సభలో 5 నిమిషాలు ఉండి కేసీఆర్వెళ్లిపోయారు. ఇంతకు జనవరి 2 నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు కేసీఆర్ వస్తారా రారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో నందినగర్‌లోని తన నివాసంలో ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తూ..శాసనసభా వేదికగా సర్కార్‌ను ఇరకాటంలో పెట్టే ప్లాన్ చేస్తున్నారు గులాబీ దళపతి. అటు సర్కార్ కూడా జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌లో కృష్ణా గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎజెండాను కూడా ఫిక్స్ చేసింది. జనవరి 2న కృష్ణా, 3న గోదావరి బేసిన్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు కూడా అవకాశం ఇవాలని ప్రతిపక్షం బీఆర్ఎస్ కోరుతోంది. ఈ అసెంబ్లీ సెషన్‌కు అటెండ్ కావాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. కృష్ణా, గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చలో కేసీఆర్ పాల్గొంటారని తెలుస్తోంది. ఇరిగేషన్ విషయంలో సీఎంతో సహా మంత్రులెవరికీ సరైన అవగాహన లేదనేది కేసీఆర్ అంచనా అంటున్నారు. వాళ్లు మాట్లాడాలంటే ప్రిపేర్ అయి రావాలి. మనది డైరెక్ట్ అటాకే అని పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారట. మొత్తం అసెంబ్లీ సెషన్‌కు కాకపోయినా, నదీ జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చకు మాత్రం తాను తప్పకుండా అటెండ్ కావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే, సభ ఎంత ఇంట్రెస్టింగ్‌గా కొనసాగుతుందో చూడాలి.

ప్రతిపక్షం

హైదరాబాద్,

శుక్రవారం
02.01.2026

పంచాయతీ ఎన్నికల్లో బహుజనుల నిశబ్ద విప్లవం



సంపతి రమేష్ మహారాజ్
7989579428

ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు కేంద్ర బిందువు గ్రామ పంచాయతీ ఎన్నికలు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు తమ కేటాయించిన రిజర్వేషన్ శాతం కంటే అధికంగా ఎన్నిక కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. రిజర్వ్ కాని సీట్లలో కూడా గెలవడం గ్రామ స్థాయి రాజకీయాల్లో చైతన్యం, స్వాభిమానానికి సూచిక. రాష్ట్ర రాజకీయ చరిత్రలో సామాజిక మార్పుకు సంకేతంగా, బహుజన వాదానికి ప్రతీకగా చెప్పవచ్చు. భారతదేశ సగటు కన్నా తెలంగాణలో అత్యధిక శాతం బీసీ జనాభా ఉంది, వారి రాజకీయ ప్రాతినిధ్యం దశాబ్దాలుగా అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బీసీల కోసం 'డెడికేటెడ్ కమిషన్' నియమించారు. సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ సర్వే జరిపింది. అనంతరం బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్ విద్య ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఇవ్వడానికి బిల్లు ఆమోదించి రాష్ట్రపతికి పంపారు. దీనికి ఆమోదం లభించకపోవడంతో తక్షణం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్స్ అమలుచేయడానికి జీవో 9 ను జారీచేసింది. దీన్ని ఆధిపత్య కులాలు హైకోర్టులో సవాలు చేయడంతో బ్రేక్ పడింది. దీనికి ప్రధాన కారణం అగ్రకుల కుల రాజకీయ పార్టీల చట్టబద్ధం చేయకపోవడమే. బీసీల్లో ఉద్యమానికి దారితీసాయి. ఆ ఉద్యమ ప్రభావంతో ఎన్నడులేని లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో బీసీ, దళిత వర్గాల మధ్య ఒక కొత్త రాజకీయ చైతన్యం పెరిగి, పల్లె పోరులో అగ్రకులాలకు అభిముఖంగా స్థానిక రాజకీయ పోరు జరిగింది. బహుజనుల సామాజిక చైతన్యం ఒక నిశబ్ద రాజకీయ విప్లవానికి పునాది వేసింది.

చరిత్రలో బహుజనుల అరుదైన గెలుపు

పంచాయతీ రిజర్వేషన్లు మొత్తం 50 శాతం వరకే పరిమితం చేయాలనే సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లను కొత్తగా కేటాయిస్తూ జీఓ 46 జారీ చేసింది. ఇందులో కూడా గతంలో కన్నా ప్రత్యేకించి సర్పంచ్ కోటాను 17 శాతానికి తగ్గించడంపై బీసీ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఒక వైపు చట్టపరమైన 50 శాతం పరిమితి విధింపు, మరో వైపు గతంలో కన్నా బీసీల రిజర్వేషన్ శాతం తగ్గించినప్పటికీ...జనరల్ స్థానాల్లో బీసీ ఎస్సీ ఎస్టీలు పోటీచేసి తమ రిజర్వేషన్లకు అతీతంగా విజయకేతనం ఎగరవేశారు. గణాంకాల పరంగా పరిశీలించినట్లయితే రాష్ట్రంలో ఈ సర్పంచి ఎన్నికల్లో 86.4 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారే విజయం సాధించారు. 13.6 శాతం మంది మాత్రమే జనరల్ అభ్యర్థులు గెలిచారని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. విజేతలైన 12,702 మందికిగానూ 36.9 శాతం మంది బీసీలు కాగా, ఎస్టీలు 29.3 శాతం, ఎస్సీలు 18.2 శాతం మంది కాగా 13.6 శాతం మంది జనరల్ కేటగిరీ నుంచి ఎన్నికయ్యారనీ ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. తమకు రిజర్వ్ అయిన వాటి కంటే అధికంగా 166 స్థానాల్లో మహిళలు గెలిచినట్లు, యువత అత్యధిక స్థానాల్లో గెలిచారనీ రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ ఎన్నికల్లో ముఖ్యంగా జనరల్ స్థానంలో బీసీలు 50 శాతంపైగా గెలవడం బీసీ వర్గాలల్లో స్పష్టమైన మార్పుకు నిదర్శనం. ఈ ఎన్నికల్లో వచ్చిన ప్రధాన మార్పులను పరిశీలిస్తే... డబ్బు పెట్టిన అగ్రకుల నాయకులు ఓడిపోయారు. ఇన్నాళ్లు రాజకీయంగా దూరంగా ఉన్న బీసీ, ఎస్సీ కులాలు ఉమ్మడిగా తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నం చేశారు. జగిత్యాల జిల్లా,బుగ్గారం మండలం, సిరికొండ గ్రామంలో బీసీ కులానికి చెందిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన పంచిత ధర్మరాజు అత్యధిక డబ్బులు పంపిణీ చేసిన అగ్రకుల ఓ పార్టీ నాయకునిపై ఒక ఓటు తేడాతో గెలుపొంది చరిత్ర సృష్టించాడు. తెలంగాణ ఓ గ్రామంలో గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్లు మరియు సర్పంచ్ మొత్తంగా ఎస్సీలకు గెలుపొంది రికార్డు సృష్టించారు. బీసీ ఎస్సీ ఎస్టీలలో ఇలాంటి అరుదైన గెలుపు తెలంగాణ రాజకీయ సామాజిక ఒక చిత్రాన్ని మార్చింది. వేల కోట్లు డబ్బులు ఖర్చుపెట్టిన అగ్రకుల పార్టీలకు అభిముఖంగా గెలుపొందడం తెలంగాణ చరిత్రలో ఇది మొదటిసారి.

ఉమ్మడి పోరాటాలతో ముందుకెళ్లాలి.

కుల గణన, బీసీ రిజర్వేషన్స్ కు అంశాలు సామాజిక సమీకరణకు దారితీసాయి. ఈ మార్పుకు ప్రధాన కారణం తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నికార్సైన బహుజన ఉద్యమాలు కొనసాగడమే. తెలంగాణ రాష్ట్రంలో బహుజన వర్గాలంతా తరతరాలుగా అగ్రకుల పాలకుల దోపిడికి గురయ్యారు. ఈ క్రమంలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీ బలగాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగించాలి. ఇందుకై వారిని పూలే, అంబేడ్కర్, కాన్సిరాం దారిలో నడిపించడానికి డాక్టర్ విశారదన్ మహారాజ్ గారి ఆలోచన నుంచీ మార్చు 31, 2025న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బిసి,ఎస్సీ,ఎస్టీల ఐక్య కార్యాచరణ సమితి (జాక్) ఆవిర్భవించింది. దీనికి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు టి.చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ పొలిటికల్ ఫ్రింట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ పలు హాజరై దిశా నిర్దేశమీచ్చారు. వీరి ఆధ్వర్యంలోనే 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఏర్పడింది. బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్ లో చట్టం చేసి, 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేసింది. బావాజాలవ్యాప్తికి రాజ్యాంగబద్ధంగా పలు కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా అక్టోబర్ 24న జరిగింది. ఈ ధర్నా బీసీ ఉద్యమానికి ఆరంభ సంకేతంగా నిలిచింది. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కామారెడ్డి వేదికగానే చారిత్రకమైన బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. అదే వేదికగా నవంబర్ 15న బీసీల ఆక్రోష సభ జరిగింది. ఈ కార్యక్రమాలలో బీసీ ఎస్సీ ఎస్టీలు ఉమ్మడిగా కలిసిరావడంతో ఆ వర్గాల్లో రాజకీయ చైతన్యం ప్రారంభమైనవి. ఈ సమితి ఆధ్వర్యంలో భాగమైన డాక్టర్ విశారదన్ మహారాజ్ జాక్ వేదికగా లక్ష కిలో మీటర్ల రథయాత్ర అట్టడుగు వర్గాల రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుతూనే...రాజ్యాధికారం కోసం ధర్మ యుద్ధం సాగింది. ప్రజా సమస్యలపై సింహ గర్జన చేశాడు. గతంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ గారు దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో పదివేల కిలోమీటర్లు బీసీ ఎస్సీ ఎస్టీల స్వరాజ్య పాదయాత్ర చేశారు. ఆయా కులాల వాటానడుగుతూ రాజ్యాధికార స్పృహ రగిలించాడు. నేటి బీసీల రాజకీయ స్పృహకు కారణం కూడా ఇదే. ఒకవైపు జాక్ రథ యాత్ర, మరొకవైపు బీసీ రిజర్వేషన్ల సాధన సమితి పోరాటం నేటి స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజనుల విజయానికి కారణమైనది. ఈ వాస్తవాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అర్థం చేసుకొని భవిష్యత్తు రాజ్యాధికార పోరాటాలకు కలిసి రావాల్సిన అవసరం ఉంది. అప్పుడే పీడిత వర్గాలకు విముక్తి లభిస్తుంది.



(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

డిజిటల్ సంకెళ్లలో రైతు..



వెంకగారి భూమయ్య
9848559863

వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచి, ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'యాప్ ఆధారిత యూరియా పంపిణీ విధానం' ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సిద్ధాంతపరంగా ఈ విధానం అత్యుత్తమంగా అనిపించినప్పటికీ, ఆచరణలో మాత్రం సామాన్య రైతుకు ఇది ఒక అగ్నిపరీక్షలా తయారైంది. నిజానికి, గతంలో యూరియా కొరతను సాకుగా చూపుతూ దళారులు సృష్టించిన కృత్రిమ కొరతను అడ్డుకోవడానికి, నిజమైన సాగుదారుడికే సబ్సిడీ ఫలాలు అందేలా చూడటానికి సాంకేతికతను జోడించడం ఆహ్వానించదగ్గ పరిణామమే. దీనివల్ల ఎరువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటమే కాకుండా, ప్రభుత్వ ఖజానాపై పడే అనవసరపు భారం కూడా తగ్గుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. రైతు వివరాలు, భూమి విస్తీర్ణం, మరియు పండిస్తున్న పంట రకం ఆధారంగా యాప్‌లో నమోదు చేసి యూరియా పంపిణీ చేయడం వల్ల వ్యవస్థలో జవాబుదారీతనం వస్తుందనేది పాలకుల ఆలోచన.

అయితే, ఈ వ్యవస్థను రూపొందించేటప్పుడు పాలకులు మరియు విధాన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించే ఉన్నతాధికారులు భారతీయ గ్రామీణ వాస్తవాలను, సామాన్య రైతు జీవన స్థితిగతులను పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోంది. మన దేశంలోని అత్యధిక శాతం రైతులు వృద్ధులు లేదా సరైన ఆధునిక విద్యకు దూరమైన వారు. వారిలో చాలామందికి స్మార్ట్ ఫోన్ అంటే ఏమిటో తెలియదు, దానిని ఆపరేట్ చేయడం అంతకంటే తెలియదు. అటువంటి రైతులకు నేరుగా యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవాలని చెప్పడం వారిని ఇబ్బందులకు గురిచేయడమే అవుతుంది. "రైతులందరూ చదువుకున్నారా? అందరి దగ్గర స్మార్ట్ ఫోన్లు ఉంటాయా? అసలు వారికి ఈ యాప్ మీద కనీస అవగాహన ఉందా?" అనే ప్రాథమిక ప్రశ్నలను ప్రభుత్వం విస్మరించింది. చేతిలో ఫోన్ లేని రైతు ఎరువుల దుకాణానికి వెళ్ళినప్పుడు అక్కడ ఎదురయ్యే వింత పరిస్థితులు వారిని తీవ్ర అయోమయానికి, మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. సాంకేతికత సాయంతో పనులు వేగవంతం కావాలి, కానీ ఇక్కడ పరిస్థితి తలకిందులుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు నిత్య కృత్యం. దీనికి తోడు సర్వర్లు సరిగ్గా పనిచేయకపోవడం,



బయోమెట్రిక్ యంత్రాలు వేలిముద్రలను గుర్తించకపోవడం వంటి సాంకేతిక లోపాలు రైతు పాలిట శాపంగా మారాయి. డేటా తప్పిదాల వల్ల అర్హత ఉన్న రైతులకు కూడా యూరియా నిరాకరించబడుతోంది. దీనివల్ల రైతులు తమ వ్యవసాయ పనులన్నీ మానుకుని, రోజుల తరబడి ఎరువుల దుకాణాల చుట్టూ, సహకార సంఘాల చుట్టూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. వ్యవసాయం అనేది ప్రకృతితో, కాలంతో ముడిపడి ఉన్న వృత్తి. విత్తిన సమయానికి లేదా సరైన వర్షం పడిన వెంటనే యూరియా వేయకపోతే పంట ఎదుగుదల దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. రైతును ఒక ఉత్పత్తిదారుడిగా గౌరవించాల్సిన వ్యవస్థ, అతడిని ఒక యాప్ ముందు చేతులు చాచి నిలబడేలా చేయడం విచారకరం. మరోవైపు, కౌలు రైతుల పరిస్థితి ఈ యాప్ విధానంలో మరింత అగమ్యగోచరంగా తయారైంది. ప్రభుత్వ రికార్డుల్లో ఇప్పటికీ భూయజమానుల పేర్లు మాత్రమే ఉండటంతో, వాస్తవంగా క్షేత్రస్థాయిలో మట్టిలో కష్టపడి సాగు చేసే లక్షలాది మంది కౌలు రైతుల వివరాలు యాప్‌లో ఉండటం లేదు. యూరియా కోసం వారు ఇప్పటికీ భూ యజమానుల సంతకాల మీదో లేదా వారి దయాదాక్షిణ్యాల మీదో ఆధారపడాల్సి వస్తోంది. యాప్‌లో నమోదైన భూమి వివరాలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉండటం వల్ల కూడా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. వ్యవసాయ సహకార సంఘాల వద్ద సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల అక్కడి సిబ్బందికి, రైతులకు మధ్య నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. యాప్ వాడకం తెలియని రైతుల ఆగ్రహం చివరకు దుకాణదారుల మీదో లేదా చిన్నస్థాయి ఉద్యోగుల మీదో పడుతోంది. ప్రభుత్వానికి ఉండాల్సిన ప్రధాన లక్ష్యం రైతుకు సమయానికి ఎరువులు అందించడమే కానీ, కేవలం యాప్‌లో డేటాను నింపడమే పరమావధి కాకూడదు. సాంకేతికత అనేది రైతుకు సేవ చేసే సాధనంగా ఉండాలి తప్ప, వారిని శిక్షించే ఆయుధంగా మారకూడదు. అధికారులు కేవలం ఏసీ గదుల్లో కూర్చుని అంకెలతో విశ్లేషణలు చేయకుండా, క్షేత్రస్థాయిలోకి వచ్చి రైతుల కష్టాలను ప్రత్యక్షంగా చూడాలి. యాప్ విధానం వల్ల దళారుల ప్రభావం కొంత తగ్గిందన్న మాట వాస్తవమే అయినా, దానివల్ల రైతు పడుతున్న ఇబ్బందులు ఆ ప్రయోజనాన్ని మరుగున పడేస్తున్నాయి. ఇది రైతు ప్రయోజనాల కంటే కూడా ప్రక్రియకే ప్రాముఖ్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ విధానంలో సామాన్యుడికి ఇబ్బంది కలగకుండా మార్పులు చేయాలి. ప్రతి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండేలా సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ ఉచితంగా నమోదు మరియు సవరణల సౌకర్యం కల్పించాలి. ఇంటర్నెట్ సరిగ్గా లేని ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ ద్వారా ఎరువులు పంపిణీ చేసే వెసులుబాటును స్థానిక అధికారులకు ఇవ్వాలి. ముఖ్యంగా కౌలు రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇచ్చి, యజమానులతో సంబంధం లేకుండా వారికి నేరుగా యూరియా అందేలా చూడాలి. సాంకేతికతను మానవీయ కోణంలో, రైతు అవసరాలకు అనుగుణంగా అమలు చేసినప్పుడే వ్యవసాయ రంగానికి నిజమైన మేలు జరుగుతుంది. రైతు కేంద్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకున్నప్పుడే ఏ విధానమైనా విజయవంతమవుతుంది. లేదంటే ఈ యాప్ కష్టాలు రైతుల అసహనాన్ని పెంచి, వారు వ్యవసాయంపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది అన్న సూత్రాన్ని పాలకులు మరువకూడదు.


(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

భారత శాస్త్ర విజ్ఞానానికి మార్గదర్శకుడు వసంత్ గోవారికర్



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

వసంత్ రాంచోడ్ గోవారికర్ (25 మార్చి 1933 - 2 జనవరి 2015) భారతదేశ అంతరిక్ష పరిశోధనను కొత్త స్థాయికి తీసుకువెళ్లిన ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్త. ఆయన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ISRO)లో కీలకమైన బాధ్యతలు నిర్వహించి, దేశంలో శాస్త్ర విజ్ఞానానికి మార్గదర్శకుడిగా నిలిచారు. అంతరిక్ష పరిజ్ఞానం, వాతావరణ శాస్త్రం, వ్యవసాయం, జనాభా అంశాల్లో ఆయన చేసిన కృషి అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉంది. వసంత్ గోవారికర్ 1933 మార్చి 25న మహారాష్ట్రలోని పూణేలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యను కొల్హాపూర్‌లో పూర్తి చేసి, పూణేలో ఉన్న ఫెర్గూసన్ కాలేజీ నుండి ఇంజినీరింగ్ డిగ్రీ పొందారు. ఉన్నత చదువుల కోసం ఇంగ్లాండ్‌కు వెళ్లి బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. చిన్నతనం నుంచే శాస్త్ర రంగంపై ఉన్న ఆసక్తి ఆయన జీవితాన్ని శాస్త్రవేత్తగా మలచింది. వసంత్ గోవారికర్ 1967లో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ISRO) లో చేరారు. SLV (సాటిలైట్ లాంచ్ వెహికల్) అభివృద్ధి కార్యక్రమంలో ఆయన చేసిన కృషి భారత అంతరిక్ష శాస్త్రంలో గొప్ప మైలురాయిగా నిలిచింది. ఈ ప్రాజెక్టులో ఇస్రో వ్యవస్థాపకుడు డా. విక్రం సారాభాయి నాయకత్వంలో పనిచేసి, భారతదేశ ఉపగ్రహ ప్రయోగాల్లో ప్రధాన పాత్ర పోషించారు. 1991 నుండి 1993 వరకు, భారత ప్రధాని పి వి నరసింహ రావు కు శాస్త్రీయ సలహాదారుగా వసంత్ గోవారికర్ సేవలందించారు. వసంత్ గోవారికర్ వాతావరణశాస్త్ర రంగంలోనూ ఎనలేని కృషి చేశారు. ఆయన రూపొందించిన "లాంగ్ రేంజ్ వాతావరణ ఫోర్కాస్ట్ మోడల్" ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ మోడల్ వ్యవసాయానికి అవసరమైన వాతావరణ సమాచారం అందించడంలో సహాయపడింది. వసంత్ గోవారికర్ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన రూపొందించిన అగ్రో క్లైమాటిక్ జోన్ మ్యాపింగ్ వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో మరియు నీటి వనరుల సమర్థ వినియోగానికి మార్గదర్శకంగా మారింది.



జనాభా పెరుగుదల భారత దేశానికి పెద్ద సమస్యగా ఉన్నప్పుడు, గోవారికర్ దీనిపై చేసిన పరిశోధనలు కీలకమయ్యాయి. ఆయన రూపొందించిన డేటా మోడల్స్ ప్రభుత్వానికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో సహాయపడ్డాయి. వసంత్ గోవారికర్ చేసిన కృషి పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందించింది. పద్మశ్రీ అవార్డు (1991): శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన కృషికి భారత ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రదానం చేసింది. వాతావరణ శాస్త్రంలో గ్లోబల్ అవార్డులు మరియు ఇతర సన్మానాలు అందుకున్నారు. వసంత్ గోవారికర్ 2015 జనవరి 2న కన్నుమూశారు. ఆయన చేసిన విశిష్ట కృషి భారత శాస్త్ర రంగాన్ని మాత్రమే కాదు, ప్రపంచ స్థాయి పరిశోధనలను కూడా ప్రభావితం చేసింది.త్ గోవారికర్ భారత అంతరిక్ష పరిశోధన, వాతావరణ శాస్త్రం, వ్యవసాయ రంగాల్లో నూతన మార్గాలను సృష్టించి, దేశానికి చిరస్మరణీయుడిగా నిలిచారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయన చూపిన మార్గం భారతదేశ భవిష్యత్ శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలుస్తుంది.

(జనవరి 2...వసంత్ గోవారికర్ వర్ధంతి)

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

రహదారి భద్రతకు ప్రజల భాగస్వామ్యం అవసరం



- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 1: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, పాంప్లెట్స్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,రహదారి ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం లో పలు కార్యక్రమాలునిర్వహిస్తున్నట్లు తెలిపారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన సందేశాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. అనంతరం రవాణా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులతో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి అరుణ, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, జిల్లా రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





అంకితభావంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు,సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన సంవత్సరం అందరికీ ఆరోగ్యం, ఆనందం, విజయాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేయాలన్నారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లక్ష్యాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని కలెక్టర్ కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా పనిచేయాలన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులు జిల్లా కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు అందజేసి, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జీవితంలో మంచి స్థానంలో నిలవాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, వసతి గృహ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 1: నూతన సంవత్సరం-2026 సందర్భంగా మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి , పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆధర్శ్ రెడ్డి కలిసి మాజీ మంత్రి హరీశ్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం రాష్ట్ర ప్రజలకు శాంతి, సుభిక్షత, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కాటా సునీత రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ , తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి , జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్ , జగన్నాథ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మణిక్ యాదవ్ , యువ నాయకుడు మణిక్ యాదవ్ , మాజీ సర్పంచ్‌లు ఈఎస్ వెంకట్ రెడ్డి, మణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా రవి

ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి1: కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అదనపు కలెక్టర్ హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా నియామకం అయిన నెమరుగొమ్ముల రవి గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సరం సందర్భం గా శుభాకాంక్షలు తెలియజేశారు. రవి ఇంతకుముందు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆర్డీవోగా విధులు నిర్వహించారు.

గణితంలో కల్లెం శ్రీనివాసరెడ్డికి పీహెచ్‌డీ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 1: హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శ్రీనివాసరెడ్డి కల్లెం డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'రంధ్రాల మాధ్యమంలో సాగే ఉపరితలంపై హైపర్ బోలిక్ టాంజెంట్ నానోఫ్లూయిడ్ ప్రవాహంలో ఉష్ణ, ద్రవ్యరాశి బదిలీ యొక్క గణన విశ్లేషణ'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివారెడ్డి శేరి గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశోధన మాగ్నెటో హైడ్రో డైనమిక్ ప్రభావాలు, ఉష్ణ బదిలీ ప్రవర్తన, అయస్కాంత క్షేత్ర ప్రభావం, నానోఫ్లూయిడ్ డైనమిక్స్‌ను విశ్లేషించడానికి మ్యాట్ ల్యాబ్ యొక్క బీవీపీ4సీ ఫ్రేమ్ వర్కును ఉపయోగిస్తుందని వివరించారు. నాన్ లీనియర్ డిఫరెన్షియల్ సమీకరణాల సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఆయన కృషి చేసినట్టు తెలిపారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ - గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



సీఎంను కలిసిన పోచారం

ప్రతిపక్షం, బాన్స్ వాడ : నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. ఆయన వెంట మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఉన్నారు.



జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 1: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమాలను పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ప్రారంభించారు.జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కరపత్రాలను గౌరవనీయులు పోలీస్ కమిషనర్ జిల్లా ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ జి.దుర్గా ప్రమీల తో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జనవరి 1 నుండి జనవరి 31 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీ.సీ.పీ (అడ్మిన్) బస్వరెడ్డి, అదనపు డి.సి. పి (ఎ.ఆర్) రామ్ చందర్ రావ్, జే. ఉమామహేశ్వర రావు, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారులు, బీ శ్రీనివాస్, కిరణ్ కుమార్, నాగలక్ష్మి ,అజయ్ కుమార్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, ఏసీపీలు, ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రెడ్ క్రాస్ విభాగం జిల్లా మేనేజరు పాల్గొన్నారు.



సమ్మక్క భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి1: మంచిర్యాల జిల్లాలోని కాలేజీ రోడ్లో గల గోదావరి తీరాన జనవరి 28, 29, 30 తేదీలలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు అధికారులను ఆదేశించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారక్క జాతరకు అనేక సుదూర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు రానున్నందున సంబంధిత అధికారులు అన్ని వసతులు తగిన విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. గోదావరి గౌతమేశ్వర ఆలయం నుండి గోదావరి నది ప్రవాహం వరకు రెండు వైపులా విద్యుత్తు తీపాలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ఇరువైపులా శాలిటేషన్ నిర్వహించాలన్నారు. తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు భక్తులు గోదావరి తీరంలో నిద్ర చేయడం వల్ల వచ్చే వ్యాధులను కరికెట్టెందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే భక్తులకు అందుబాటులో ఉండేందుకు పూజ సామాగ్రిని హించాలన్నారు పుష్కర ఘాట్ల మెట్లలో నిరంతరం శుభ్రపరుస్తూ భక్తుల సౌకర్యార్థం సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. గోదావరిలో గజ ఈతగాలను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు మరి ఇతర అవసరాలకు ఇబ్బందులు కారకుండా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌ను కలిసిన డీసీసీ నగేష్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 1: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే నగేష్ రెడ్డి హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగేష్ రెడ్డి తో పాటు సీఎం ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్ అలీ, బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి సునీల్ రెడ్డి ఉన్నారు.

281 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- సరైన పత్రాలు లేని 224 వాహనాలు సీజ్
- కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం



ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్. జనవరి 1: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ఆలం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 281మందిపై కేసులు నమోదు చేశారు. ప్రమాదాల నివారణే ధ్యేయంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో పట్టుబడిన 281 వాహనాలను సీజ్ చేశారు. కమీషనరేట్ వ్యాప్తంగా నంబర్ ప్లేట్ లేని లేదా సరైన ధ్రువపత్రాలు లేని 224 వాహనాలను సీజ్ చేశారు.కాంటాక్ట్ ఈచలాన్: 68 కేసులు (రూ. 35,000 జరిమానా) విధించగా,నాన్‌కాంటాక్ట్ ఈచలాన్: 1025 కేసులు (రూ. 4,97,875 జరిమానా).మొత్తం చలాన్లు: 1267కేసులు నమోదు చేసి, రూ. 6,24,920 జరిమానా విధించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం పోలీసులు రాత్రంతా విధుల్లో ఉండి నిఘా కొనసాగించారని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాల పట్ల అవగాహన కల్పించినప్పటికీ, నిబంధనలు ఉల్లంఘించిన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఆయన తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించిన ప్రజలకు మరియు అంకితభావంతో పనిచేసిన పోలీస్ సిబ్బందికి సీపీ అభినందనలు తెలియజేశారు.



క్యాన్సర్ బాధితులకు జగ్గారెడ్డి ఆర్థిక సహాయం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 1: సంగారెడ్డి నియోజకవర్గం లో క్యాన్సర్ బారిన పడిన నిరుపేదలకు జగ్గారెడ్డి తన సహాయాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో క్యాన్సర్ బారిన పడ్డ వ్యక్తులకు చికిత్స కోసం లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేసిన విషయం తెల్సిందే, తాజాగా క్యాన్సర్ తో బాధ పడుతున్న మరో ఆరుగురికి జగ్గారెడ్డి రెండు లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అంద చేశారు. గుట్కా, సిగరెట్ తాగడం వంటి దురలవాట్ల కారణంగా క్యాన్సర్ బారిన పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. దురలవాట్ల కు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని కోరారు.

హ్యాపీ న్యూ ఇయర్ రేవంత్ అన్న

- సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నీలం మధు ముదిరాజ్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి న్యూ ఇయర్ విషెస్ తెలిపారు. పటాన్ చెరు ప్రాంతంలో రెండు జిహెచ్ఎంసి సర్కిల్ కార్యలయాలతో పాటు రెండు నూతన పోలీస్ స్టేషన్లను మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో డివిజన్ల అభివృద్ధితో పాటు నూతన మున్సిపాలిటీలకు నిధులు అందించాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో రానున్న మున్సిపల్, స్థానిక ఎన్నికలు, జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడి అత్యధిక స్థానాలను గెలవాలని నీలం మధుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో అత్యధిక స్థానాలు గెలిచే విధంగా అందరం కలిసి కట్టుగా కృషి చేస్తామని నీలం సీఎంకి తెలిపారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ట్రాఫిక్ రూల్స్ పాటించాలి.
- ప్రజల భద్రతే ఆర్టీసీ భద్రత
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 1: రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. గురువారం మెదక్ ఆర్టీసీ బస్సు డిపోలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా మహోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ నాగేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, స్కూల్ కళాశాలలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ తప్పనిసరి, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, వేగ నియంత్రణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత,పనిచేసే వర్గం ప్రభావితమవుతున్న నేపథ్యంలో, వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాదచారులు కూడా రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం ఎంతో అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమాల అమలులో పోలీస్ శాఖ, రవాణా శాఖ, విద్యా శాఖ, ఆరోగ్య శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో మెదక్ జిల్లా డిప్యూటీ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, పోలీస్ అధికారులు,రవాణా శాఖ అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

“



పార్టీని బతికించుకునేందుకు కేసీఆర్‌మళ్లీ చంద్రబాబు పేరును, నీటి సెంటిమెంట్‌ను వాడుకుంటున్నారు. పాలమూరు-, రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్‌ఏడేళ్లు డీపీఆర్ సమర్పించలేదు. దీంతో పర్యావరణ అనుమతులు రాలేదు. అనుమతులు లేని ప్రాజెక్టు నిర్మిస్తున్నారంటూ కొందరు కేసులు వేశారు. డీపీఆర్‌లేని ప్రాజెక్టుకు కమీషన్ల కోసం కేసీఆర్ రూ.27వేల కోట్లు చెల్లించారు.

- సీఎం రేవంత్‌రెడ్డి

ప్రాంతీయం




నూతన సంవత్సరంలో విషాదం

- మద్యం మత్తులో వ్యక్తి మృతి

ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 1: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన పయ్యావుల పరుశరాములు(32) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది.నూతన సంవత్సరం రోజున అ ఇంట విషాద ఛాయలు అలముకున్నాయి. గురువారం త్రీటౌన్ సిఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పరుశరాములు ఆర్చి ఫార్మా కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. డిసెంబర్ 31న రాత్రి సమయంలో గ్రామ సర్పంచ్ చింతల శ్రీనివాస్ ఇంటి నుండి తిరిగి తన ఇంటికి మోటార్ సైకిల్ పై వెళుచుండగా నంగునూరు నుండి సిద్దిపేటకు వస్తున్న కంప్రెసర్ ట్రాక్టర్ అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయినట్లు సీఐ తెలిపారు. గాయపడిన వ్యక్తిని 3 టౌన్ ఎస్సై వెంకటేశ్వర్ల సహకారంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మద్య మత్తులో ట్రాక్టర్ డ్రైవర్ అతి వేగంగా వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని డ్రైవర్ యాదగిరి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్కు పంపించినట్లు సిఐ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ కు బ్రీత్ ఎనలైజర్ చేయగా మద్యం సేవించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు మృతునికి భార్య రాణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరిస్తే చర్యలు తీసుకుంటామని సిఐ విద్యాసాగర్ అన్నారు.



నాచగిరిలో భక్త జనసిరి

- స్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 1: ఆంగ్ల సంవత్సరం మొదటి రోజు ను పురస్కరించుకొని వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గురువారం తెల్లవారుజాము నుండే భక్తులతో కిటకిటలాడినది, ఇదే సందర్భంలో ఉదయం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నరసారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుఆంక్ష రెడ్డి కుటుంబం స్వామివారిని దర్శించుకోవడం జరిగినది. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా కార్యనిర్వాణాధికారి విజయ రామారావు, చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, ధర్మకర్తలు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసినారు. సబ్ ఇన్స్పెక్టర్ గౌరారం మరియు వారి సిబ్బంది తగిన భద్రత ఏర్పాటు చేశారు .



బాల సదన్‌లో పిల్లలతో నూతన సంవత్సర వేడుకలు

- పాల్గొన్న ఎస్పీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 1: మెదక్ పట్టణంలోని బాల సదన్‌లో పిల్లలతో కలిసి గురువారం నూతన సంవత్సర వేడుకలను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వారికీ తినిపించారు. అనంతరం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో వారు సాధించాలనుకుంటున్న లక్ష్యాల వివరాలు తెలుసుకొని, మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, కష్టపడి చదివే అలవాటు ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పిల్లలకు ప్రోత్సాహం అందించారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్,నరేందర్ గౌడ్,రంగా నాయక్, సీఐలు మహేష్,కృష్ణమూర్తి,శైలేందర్, బాల సాధన్ అధికారులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 1: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి, అడిషనల్ అడ్మిన్ డీసీపీ కుశాల్‌కర్ తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు సీటుబెల్ట్, హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని ఆయన సూచించారు. రోడ్డు సేఫ్టీ మాసోత్సవాల సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి విక్టరీ కేఫ్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఎంవీఐ శంకర్ నారాయణ, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువతే ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రతి వాహనదారు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని అధికారులు కోరారు.



ధూప దీప నైవేద్యం కింద

అమ్మవారికి నెలకు ఐదు వేలు

- చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 1: చేగుంట మండల కేంద్రంలోని మహంకాళి అమ్మవారు ఆలయంలో ధూపదీప నైవేద్యం కింద నెలకు ఐదు వేలు అందజేస్తానని చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ తెలిపారు. చేగుంట ఉపసర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా అమ్మవారును దర్శించుకుని ఆయన ప్రకటించారు. గతంలో ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని రఫీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కమిటీ సభ్యులు రఫీక్ ను అభినందించి శాలువాతో సత్కరించి సన్మానించారు.



బొప్పాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 1: బొప్పాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అని ఎం పి మాధవనేని రఘుందన్ రావు అన్నారు.గురువారం దుబ్బాక నియోజకవర్గం బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ తమ స్వంత ఖర్చులతో గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన 'బాల వికాస ఉచిత మినరల్ వాటర్' పథకాన్ని ఎం పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం పి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు శుద్ధి చేయబడిన తాగునీటిని పూర్తిగా ఉచితంగా అందించే ఈ సేవ బొప్పాపూర్ గ్రామానికి ఒక మైలురాయి కార్యక్రమంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ బొప్పాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఓపెన్ జిమ్ ద్వారా గ్రామ యువత, మహిళలు , వృద్ధులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలో రాత్రివేళ భద్రత , మెరుగైన వెలుతురు కోసం హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల కోరిక మేరకు ఎంపీ బొప్పాపూర్ గ్రామానికి నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంజూరు చేస్తూ, అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. అలాగే ఎనగుర్తి నుంచి శిలాజీనగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని, ఇందుకు కేంద్ర నిధులు మంజూరు చేయనున్నట్లు ఎంపీ తెలిపారు. అలాగే కూడవెల్లి వాగు సమీపంలోని పెద్ద ఒర్రె వైపు ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేస్తామని, రైతులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బొప్పాపూర్‌ను ఆధునిక గ్రామంగా తీర్చిదిద్దే దిశగా మరిన్ని అభివృద్ధి పనులు ,భవిష్యత్తులో బొప్పాపూర్ గ్రామాన్ని ఒక ఆధునిక, సదుపాయాల పరిపూర్ణ గ్రామంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోనపురం పద్మ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు అండగా బీఆర్ఎస్

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి
- జీవో నెం.252కు వ్యతిరేకంగా టీయూడబ్ల్యూజే వినతి పత్రం

ప్రతిపక్షం, దుబ్బాక,జనవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.252ను నిరసిస్తూ, పాత విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు పెద్దపీట వేసి, వారికి రావాల్సిన అన్ని సంక్షేమ పథకాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, అక్రిడేషన్ కార్డులు వంటి అంశాల్లో అన్ని విధాలా అండగా నిలిచిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులను 13 వేలకే పరిమితం చేస్తూ తీసుకున్న నిర్ణయం అన్యాయమని అన్నారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, జర్నలిస్టుల హక్కుల కోసం ప్రభుత్వంతో పోరాటం చేస్తామని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ జర్నలిస్టులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే జిల్లా బాధ్యులు గందె నాగరాజు, జిల్లా నాయకులు నిమ్మ అశోక్, జర్నలిస్టులు కట్ట నవీన్, ప్రసాద్, ప్రభాకర్, సుదర్శన్‌తో పాటు దుబ్బాకకు చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



అనాథ బాలికలకు దుస్తుల పంపిణీ

ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 1: సిద్ది పేట బాలసదనంలోని అనాథ బాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. బోరెడ్డి మధుసూదన్ రెడ్డి కుమారుడు సంతోష్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. సంతోష్ రెడ్డి చేతుల మీదుగా బాలికలకు నూతన దుస్తులు అందజేశారు. అనాథ బాలికలకు ప్రభుత్వం, సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, ధైర్యంగా ముందుకు సాగుతూ విద్యపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసదనం అధికారిణి వసంత, సిబ్బంది, కుటుంబ సభ్యులు సరిత, నియాన్సిక, నర్సికర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర స్వామి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ తో కలిసి బాలాజీ క్షేత్రం లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి1: దుబ్బాక కళ్యాణ వెంకటేశ్వర స్వామి కరుణా , కటాక్షాలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కోరుకున్నారు. గురువారం నూతన సంవత్సరం ను పురస్కరించుకొని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి దుబ్బాక లోని బాలాజీ క్షేత్రం లో వెంకటేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగునీరు, ఎరువుల కొరత, కరెంటు కొరత లేకుండా ఉండాలని సమృద్ధిగా పండి పాడి పంటలతో దుబ్బాక నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతున్ని కోరినట్లు ఆయన తెలిపారు. కొత్త సంవత్సరం లో మరింత నూతన ఉత్సహంతో ముందుకు సాగాలని మీ ఆశలు, ఆశయాలు నెరవేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. దుబ్బాక పట్టణం ఆధ్యాత్మిక కేంద్రం గా విలసిల్లుతుందని, వైకుంఠ ఏకాదశి రోజున బాలాజీ క్షేత్రం లో 70వేల మంది భక్తులు దర్శించుకోవడం ఒక చరిత్ర అని తెలిపారు.. బాలాజీ క్షేత్రం దిన దిన ప్రవర్త మానంగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.నూతన సంవత్సరం సందర్భంగా ఆయన దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం లో పార్టీ శ్రేణులు కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బాలాజీ దేవాలయం ట్రస్ట్ అధ్యక్షుడు వద్లకొండ శ్రీధర్ ,ప్రధాన కార్యదర్శి చింతా రాజు ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మి నరసింహ చార్యులు తదితరులు పాల్గొన్నారు.




కంచర్ బజార్‌లో న్యూ ఇయర్ వేడుకలు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 1: సిద్దిపేట పట్టణంలోని కంచర్ బజార్ ప్రాంతంలో గల సాయి మణికంఠ రెసిడెన్సీ వాసులు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దీప్తి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెసిడెన్సీ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దీప్తి నాగరాజు మాట్లాడుతూ, నూతన సంవత్సరం అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

జనవరి 1 నుంచి 31 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు

- ప్రతి వాహనదారుడు క్షేమంగా ఇంటికి చేరడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ కె. హైమావతి



ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 1: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరడమే రహదారి భద్రత మసోత్సవాల ముఖ్య లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. జాతీయ రహదారి భద్రత మసోత్సవాలు-2026 కార్యక్రమంలో భాగంగా గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో నిర్వహించిన ప్రారంభ సభలో ఆమె మాట్లాడుతూ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రహదారి భద్రత మసోత్సవాలు జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల మొత్తం ప్రతిరోజూ రహదారి భద్రతకు సంబంధించిన వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు షెడ్యూల్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు సకాలంలో క్షేమంగా తన ఇంటికి చేరాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా తెలుసుకుని అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్న నేపథ్యంలో హెల్మెట్ ధరించడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం, రోడ్లపై ఉన్న సిగ్నల్స్, మార్కింగ్స్‌ను గమనిస్తూ జాగ్రత్తగా ప్రయాణం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ మసోత్సవాల సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రహదారి భద్రత మసోత్సవాలకు సంబంధించిన ప్రతిజ్ఞను అధికారులు అందరితో చేయించారు. రోడ్డు భద్రతపై రూపొందించిన వివిధ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టీఏ కమిటీ సభ్యుడు సూర్య వర్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నదీ జలాలు, సాగునీటి అంశాలపై కనీస అవగాహన లేని సీఎం అసెంబ్లీలో ఉపన్యాసాలు ఇవ్వబోతున్నారు. భాక్రా నంగల్ ప్రాజెక్ట్ తెలంగాణలో ఉందని సీఎం అన్నారు. అది హిమాచల్ ప్రదేశ్‌లో ఉందన్న విషయం కూడా ఆయనకు తెలియదు. అలాంటి సీఎంతో చర్చ చేయాలా.? బీఆర్ఎస్‌కు అసెంబ్లీలో ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలి.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కలుషిత జలాలు తాగి 8 మంది మృతి

- 150 మందికి అస్వతస్థత.. ఇండోర్‌లో ఘటన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 1: దేశంలోనే అత్యంత స్వచ్ఛ నగరంగా పేరొందిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో పైపులైన్లు లీకయి మురుగు నీరు తాగునీటిలో కలిసిపోవడంతో 8 మంది మృతి చెందారు. మరో 150 మంది నగరంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ తెలిపారు. ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇండోర్‌లోని ఇద్దరు మున్సిపల్ అధికారులను సస్పెండ్ చేయాలని, ఒక పబ్లిక్ హెల్త్ ఇంజినీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని మంగళవారం రాత్రి ఆదేశించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. బాధితులందరి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల చేత విచారణకు ఆదేశించారు. ఈ నెల 25నే మున్సిపల్ కుళాయిల నుంచి వచ్చే తాగునీరు దుర్వాసన వస్తున్నాయని భగీరథ్‌పుర వాసులు గుర్తించారు. ఆ రోజు నుంచి ఆ నీటిని తాగిన పలు కుటుంబాలవారు అస్వస్థత పాలయ్యారు. మురుగునీరు తాగునీటిలో కలిసినట్లయితే ప్రజలు వాంతులు, డయేరియా, కామెర్లతో ఇబ్బంది పడతారు తప్ప చనిపోరని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితు పట్వారీ పేర్కొన్నారు. తాగునీటి పైపులైన్లలో ఏదో విష పదార్థం కలిసిపోయినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కాగా ఇండోర్ వరుసగా 8 ఏళ్లపాటు దేశంలోనే అత్యంత స్వచ్ఛ నగరంగా అవార్డులు అందుకుంది. ఇంటింటి చెత్త సేకరణతోపాటు ఆసియాలోనే అతి పెద్ద బయో సీఎన్‌జీ ప్లాంటు ఏర్పాటుతో ఆదర్శ నగరంగా గుర్తింపు పొందింది.



విశ్వ వీక్షణం



ఇరాన్‌లో జెన్‌జీ ఉద్యమం


- ఖమేనీకి వ్యతిరేకంగా రోడ్డెక్కిన యువత
- హింసాత్మక ఘర్షణల్లో పలువురు మృతి

టెహ్రాన్, జనవరి1: ఇరాన్ సుప్రీమ్ నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీకి వ్యతిరేకంగా గతవారం రోజులుగా సాగుతున్న నిరసనలు నూతన సంవత్సరం నాడు హింసాత్మకంగా మారాయి. పలువురు నిరసనకారులతోపాటు ఓ భద్రతా సిబ్బంది ఈ ఘర్షణల్లో మరణించినట్లు ఇరాన్ మీడియా, హక్కుల గ్రూపులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. కొత్త సంవత్సరం రాకతో ప్రజా నిరసనలు దేశంలోని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి. దేశవ్యాప్తంగా భద్రతా దళాలతో నిరసనకారులు తలపడ్డారు. ఈ ఘర్షణల్లో ముగ్గురు పౌరులు మరణించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. నియంత (ఖమేనీ)కు మరణదండన విధించాలని నినాదాలు చేస్తూ యూనివర్సిటీ విద్యార్థులు టెహ్రాన్ వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. 1979 ఇస్లామిక్ విప్లవం సందర్భంగా పదవీచ్యుతుడైన అమెరికా మద్దతుదారు షా మొహమ్మద్ రేజా పహ్లవీ కుమారుడు రేజా పహ్లవీకి అనుకూలంగా విద్యార్థులు నినాదాలు చేశారు. టెహ్రాన్ వ్యాప్తంగా షాకు కీర్తిస్తూ నినాదాలు మార్మోగిన దరిమిలా అమెరికాలో ప్రవాస జీవితాన్ని గడుపుతున్న రేజా పహ్లవీ ఎక్స్ వేదికగా స్పందించారు. తాను మీతోనే ఉన్నానని, తమ పోరాటం న్యాయమైనది కాబట్టి విజయం తమదేనని ఆయన నిరసనకారులను ఉద్దేశించి ప్రకటించారు. ధరల పెరుగుదలపై గత మూడేండ్లుగా ఇరాన్‌లోని అనేక ప్రాంతాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో నిరసనకారులకు, భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణలు చెలరేగాయి. లార్డేగన్, కుహదష్ట్, ఇస్ఫాహన్‌లో మరణాలు సంభవించినట్లు వార్తలు వచ్చాయి.



బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యక్తిపై దాడి

ఢాకా, జనవరి 1 : బంగ్లాదేశ్ లో తాజాగా మరో హిందూ వ్యక్తి పై మూక దాడి జరిగింది. ఈ దాడిలో సదరు వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. డిసెంబర్ 31న దేశంలోని షరియత్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. 50 ఏండ్ల వ్యక్తి ఖోకోన్ దాస్‌పై ఓ బృందం దాడి చేసింది. పదునైన ఆయుధాలతో గాయపరిచింది. అనంతరం నిప్పటించింది. ఈ దాడిలో ఖోకోన్ దాస్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తిపై దాడి జరగడం నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో ఘటన. డిసెంబర్ 24న బంగ్లాదేశ్‌లోని కలిమోహర్ యూనియన్‌లోని హోస్సైన్‌డంగా ప్రాంతంలో 29 ఏండ్ల అమృత్ మండల్ అనే వ్యక్తిని ఓ గుంపు కొట్టి చంపిన విషయం తెలిసిందే. అంతకుముందు అంటే డిసెంబర్ 18వ తేదీన భాలుకాలో హిందూ వ్యక్తి దీపు చంద్ర దాస్‌ను ఓ గుంపు కొట్టి చంపింది. డిసెంబర్ 30న కూడా మైమెన్‌సింగ్ జిల్లాలోని ఓ వస్త్ర కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న హిందూ కార్మికుడిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఇలా వరుస దాడులతో బంగ్లాదేశ్‌లోని హిందువుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

- బార్‌లో పేలుడు.. 40 మంది మృతి,100 మందికి గాయాలు

స్విట్జర్లాండ్, జనవరి 1: నూతన సంవత్సరం వేడుకలు జరుపుకుంటున్న వేళ స్విట్జర్లాండ్‌లోని ఓ విలాసవంతమైన బార్‌లో బుధవారం అర్ధరాత్రి పేలుడు సంభవించి 40 మంది వరకు మరణించగా, మరో 100 మంది గాయపడ్డారని స్విస్ పోలీసులను ఉటంకిస్తూ ఇటలీ విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే మృతుల సంఖ్య పదుల సంఖ్యలో ఉంటుందని స్విస్ పోలీసులు తెలిపారు. క్రాన్స్ మోంటానా పట్టణంలోని లె కాన్స్టెలేషన్ బార్‌లోని బేస్‌మెంట్ లో, లాంజ్‌లో పేలుడు సంభవించినట్లు స్విస్ అధికారులు చెప్పారు. ఇది ఉగ్రదాడి కాదని, మంటలు చెలరేగడంతో పేలుడు సంభవించి ఉండవచ్చని వారు చెప్పారు. పేలుడు జరిగిన సమయంలో బార్‌లో 150 మందికిపైగా ఉన్నారని వారు తెలిపారు. అసాధారణ రీతిలో దేశంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొని అడవులు దగ్ధం అవుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా బాణసంచా పేల్చడంతో ఈ పేలుడు జరిగి ఉంటుందని స్విస్ మీడియా అనుమానం వ్యక్తం చేసింది. అయితే పోలీసులు మాత్రం పేలుడుకు కారణం ఇంకా తెలియరాలేదని స్పష్టం చేశారు. క్రాన్స్‌మోంటానాలోని దవాఖానలు కాలిన గాయాలతో చేరిన రోగులతో నిండిపోయాయి. ఘటన జరిగిన తర్వాత దట్టమైన నల్లని పొగ బార్ నుంచి వెలువడుతున్న దృశ్యాలతో వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. క్రాన్స్ మోంటానాపై విమానాలు ఎగరకుండా నిషేధం విధించినట్లు పోలీసు ప్రతినిధి ఒకరు తెలిపారు. నాటకీయ పరిణామానికి దారితీసిన పరిస్థితులను నిర్ధారించడానికి అధికారులు దర్యాప్తును చేపట్టినట్లు స్విట్జర్లాండ్ ప్రాసిక్యూటర్ జనరల్ చెప్పారు.

కొత్త కార్ల ఫాస్టాగ్‌కు కేవైవీ అక్కర్లేదు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 1: కొత్త కార్లు, జీపులు, వ్యాన్లకు నో యువర్ వెహికిల్ (కేవైవీ) ప్రాసెస్ లేకుండానే ఫాస్టాగ్‌ను జారీ చేయనున్నట్లు భారత జాతీయ రహదారుల అథారిటీ ప్రకటించింది. ఈ విధానం వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. ఫాస్టాగ్ యాక్టివేషన్ తర్వాత కేవైవీ నిబంధనల కారణంగా లక్షలాది మంది సామాన్య వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది.చెల్లుబాటయ్యే వాహన పత్రాలు ఉన్నప్పటికీ వీరు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపింది. కార్లకు ఇప్పటికే జారీ అయిన ఫాస్టాగ్స్‌కు కేవైవీ అవసరం లేదని చెప్పింది. ఫాస్టాగ్ సరిగ్గా అతుక్కోకపోవడం, తప్పుగా ఫాస్టాగ్‌ను జారీ చేయడం, దుర్వినియోగపరచడం వంటి ఫిర్యాదులు వచ్చినపుడు మాత్రమే కేవైవీ అవసరమవుతుందని తెలిపింది. ఫిర్యాదులు లేకపోతే, ప్రస్తుత కార్ ఫాస్టాగ్స్‌కు కేవైవీ అవసరం లేదని స్పష్టం చేసింది.



పిల్లలకు చదువుపై ఆసక్తి ఎలా పెంచాలి?



పిల్లలు భవిష్యత్తులో మంచి స్థితిలో ఉండటానికి వారిని సరైన మార్గంలో పెంచడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. దీనికోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యను అందించడమే కాకుండా, వారు బాగా చదవడానికి ప్రోత్సహిస్తారు. దీనికోసం తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి పాఠశాలలో చదివించడమే కాకుండా, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తారు. కానీ, కొన్నిసార్లు పిల్లలు చదువు కంటే ఆటలపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. వారికి చదువుపై ఆసక్తి ఉండదు. తల్లిదండ్రుల ఒత్తిడితో వారు చదవడం ప్రారంభించినప్పటికీ, పూర్తి శ్రద్ధతో చదవరు. దీంతో కొన్నిసార్లు తల్లిదండ్రులు తమ పిల్లలను చదవమని తిడతారు లేదా ఒత్తిడి తెస్తారు. కానీ ఇలా చేసినా వారికి చదువుపై ఆసక్తి పెరగదు. ఇలాంటి పరిస్థితిలో, మీ పిల్లలు కూడా చదువుపై ఆసక్తి చూపకుండా, ఆటలపైనే శ్రద్ధ చూపిస్తే, వారికి చదువుపై ఆసక్తిని పెంచడానికి కొన్ని విషయాలు చేయాలి. అవేంటో ఈ పోస్ట్‌లో తెలుసుకుందాం.

ప్రశంసించండి..

మీ పిల్లలకి చదువుపై ఆసక్తి కలిగించడానికి ముందుగా వారు చేసే చిన్న చిన్న విషయాలను కూడా ప్రశంసించండి. ఎందుకంటే ప్రతి పిల్లవాడు తన తల్లిదండ్రుల నుండి దీనినే ఆశిస్తాడు. మీరు మీ పిల్లలను ప్రశంసిస్తే వారి మనోబలం పెరిగి, ఉత్సాహంగా చదువుపై ఆసక్తి చూపడం ప్రారంభిస్తారు.

ఇతరులతో పోల్చకండి

చాలా మంది తల్లిదండ్రులు చేసే తప్పు ఇదే. తమ పిల్లలు బాగా చదవాలనే ఉద్దేశంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో లేదా పిల్లల స్నేహితులతో పోలుస్తారు. కానీ ఇది తప్పు. తల్లిదండ్రులు చేసే ఈ పని వల్ల పిల్లలు చదువు నుండి దూరమవుతారు. వారికి చదవాలనే ఆలోచనే రాదు. కాబట్టి తల్లిదండ్రులారా మీ ఈ అలవాటును వెంటనే మార్చుకోండి.

చదువుకోసం సమయం కేటాయించండి

మీ పిల్లలకి ఒక దినచర్యను ఏర్పాటు చేయండి. ఆ దినచర్య ద్వారా మీరు మీ పిల్లలను ప్రోత్సహించవచ్చు. పిల్లల చదువుకోసం సమయం కేటాయిస్తే వారు దానిని ప్రతిరోజూ పాటిస్తే వారి పూర్తి దృష్టి చదువుపైనే ఉంటుంది. ముఖ్యంగా పిల్లలను 45 నిమిషాలకు మించి చదివించకండి.


ఒత్తిడి చేయొద్దు

పిల్లలను బాగా చదవడానికి ప్రోత్సహించాలి కానీ వారిపై చదువు ఒత్తిడిని చేయకూడదు. ఇది వారిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. పిల్లలకు చదువు భారంగా అనిపిస్తుంది. కాబట్టి, తల్లిదండ్రులారా మీరు మీ పిల్లలపై చదువు ఒత్తిడిని ఎప్పుడూ చేయకండి.

యోగా & ధ్యానం:

చదువు వల్ల పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండటానికి వారిని యోగా, ధ్యానం చేయించండి. దీనివల్ల వారి మనసు ప్రశాంతంగా ఉండి, మెదడు చురుగ్గా పనిచేస్తుంది. దీనితో పాటు, పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించండి.









ఈఎస్‌పీఎన్ వన్డే టీమ్ 2025 కెప్టెన్‌గా రోహిత్ శర్మ..

- కోహ్లీ, జో రూట్, రషీద్‌లకూ చోటు

వన్డేల్లో వీరకొట్టుడుతో అభిమానులను అలరిస్తున్న భారత క్రికెటర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ 'ఈఎస్‌పీఎన్ వన్డే జట్టు 2025కు ఎంపికయ్యారు. నిరుడు టీమిండియాకు ఛాంపియన్స్ ట్రోఫీ అందించిన హిట్‌మ్యాన్‌కు కెప్టెన్సీ దక్కగా.. దక్షిణాఫ్రికాపై శతకాలతో రెచ్చిపోయిన కోహ్లీ బ్యాటింగ్ ఆర్డర్లో మూడో స్థానం కాపాడుకున్నాడు. 2025లో వన్డేల్లో అద్భుతంగా రాణించిన 11 మందితో గురువారం ఈఎస్‌పీఎన్ జట్టును ప్రకటించింది. అందులో భారత్ నుంచి రోకోకు మాత్రమే చోటు దక్కింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా చెలరేగిపోతున్న భారత సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఈఎస్‌పీఎయన్ జట్టులో చోటు సంపాదించారు. కెప్టెన్, ఓపెనర్‌గా రోహిత్ ఎంపికవ్వగా.. అతడికి జోడీగా దక్షిణాఫ్రికా కుర్రాడు మాథ్యూ బ్రీట్జ్‌ను తీసుకున్నారు. మూడో స్థానంలో కోహ్లీ, నాలుగో స్థానానికి జో రూట్ సెలెక్ట్ అయ్యారు. నిరుడు సెంచరీలతో రెచ్చిపోయిన విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. న్యూజిలాండ్ క్రికెటర్ గ్లెన్ ఫిలిప్స్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా చోటు దక్కించుకున్నాడు. మిచెల్ శాంట్నర్, హ్యాట్ హెన్రీ (న్యూజిలాండ్) బౌలింగ్ యూనిట్‌లో నిలిచారు. ఇంగ్లండ్ స్టార్లు ఆదిల్ రషీద్ స్పిన్నర్‌గా, జోఫ్రా ఆర్చర్, జైడెన్ సీల్స్(వెస్టిండీస్) పేస్ బౌలర్లుగా వన్డే జట్టు ఆఫ్ ది ఇయర్ 2025కు ఎంపికయ్యారు. **వన్డే జట్టు ఆఫ్ ది ఇయర్ 2025 :** రోహిత్ శర్మ(కెప్టెన్), మాథ్యూ బ్రీట్జ్, విరాట్ కోహ్లీ, జో రూట్, షాయ్ హోప్(వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, మ్యాట్ హెన్రీ, జైడెన్ సీల్స్.



కొత్త యేడాది కోహ్లీ సరికొత్త పోస్ట్

కొత్త సంవత్సరం అనేక కొత్త అవకాశాలను తీసుకువస్తుంది. ఈ న్యూ ఇయర్ ఆనందాన్ని, శాంతిని తీసుకువస్తుందనే ఆశతో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కొత్త ఏడాది ప్రారంభాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. సామాన్యులతో పాటు పలువురు సెలబ్రిటీలు సైతం 2025కి బై బై చెబుతూ.. 2026కు ఘన స్వాగతం పలుకుతున్నారు. అంతేకాక తమ అభిమానులకు, కుటుంబ సభ్యులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. తాజాగా.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. భారత్ వెటరన్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం తన భార్య అనుష్క శర్మతో ఉన్న ఫొటోను జోడించి.. ప్రత్యేక పోస్ట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. వ్యక్తిగత జీవితానికి సంబంధించి కోహ్లీ గతేడాది సెప్టెంబరులో చివరగా ఓ ఫొటో షేర్ చేశాడు. తాజాగా న్యూ ఇయర్ సందర్భంగా మరోసారి సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాడు. 'నా జీవితపు వెలుగైన, నా సతీమణి అనుష్క శర్మ తో కలిసి 2026లోకి అడుగుపెడుతున్నాను' అని అనుష్క శర్మను ప్రశంసిస్తూ.. కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. ఈ పోస్ట్‌కు గంటలోపే దాదాపు నాలుగు మిలియన్ల లైక్‌లు వచ్చాయి. ప్రస్తుతం పది మిలియన్లకు పైగా దూసుకుపోతూ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. విజయ్ హజారే ట్రోఫీ, భారత్ వర్సెస్ న్యూజిలాండ్ వన్డే సిరీస్‌తో తిరిగి మైదానంలోకి అడుగుపెట్టే ముందు.. కోహ్లీ ప్రస్తుతం తన కుటుంబంతో సమయాన్ని గడుపుతున్నాడు.



జాతీయ స్థాయి ఏరోబిక్స్ విజేత తెలంగాణ

తమిళనాడులోని సేలం వేదికగా జరిగిన 3వ జాతీయ స్పోర్ట్స్ ఎరోబిక్స్ ఫిట్‌నెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ టీమ్ ఓవరాల్ విజేతగా నిలిచింది. నాలుగు రోజుల పాటు జరిగిన టోర్నీలో తెలంగాణ 734 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా, ఆతిథ్య తమిళనాడు(640) రన్నరప్ దక్కించుకుంది. బాలికల అండర్ 8 వ్యక్తిగత విభాగంలో సోనాక్షిగౌడ్, ఆద్య షణ్ముగం పసిడి పతకాలతో మెరువగా, అండర్ 10 టీమ్ ఈవెంట్‌లో సమీక్ష, జ్ఞానవి స్వర్ణాలు సొంతం చేసుకున్నారు. అండర్ 16 కేటగిరీలో ఆయేషా, క్రోద్‌వీర్‌కు రజతాలు దక్కించుకున్నారు.




ఉజ్జయినీ మహాకాళేశ్వరుడి సన్నిధిలో భారత మహిళా క్రికెటర్లు

కొత్త ఏడాది రోజున భారత మహిళా క్రికెటర్లు ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, షఫాలీ వర్మ, అరుంధతి రెడ్డిలు గురువారం ఇక్కడి ప్రసిద్ధ జ్యోతిర్లింగానికి పూజలు చేసి శివయ్య అనుగ్రహం పొందారు. 'భస్మ హారతి' లో పాల్గొన్న టీమిండియా స్టార్లు ఈ ఏడాది తమకు అన్నీ శుభాలే కలగాలని దైవాన్ని ప్రార్థించారు. అనంతరం ఆలయ పూజారి భారత క్రికెటర్లకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్‌ను ఒడిసిపట్టి చరిత్ర సృష్టించిన టీమిండియా పొట్టి సిరీస్‌లో శ్రీలంకను వైట్ వాష్ చేసింది. విశ్వ విజేతగా తొలి సిరీస్‌ను అజేయంగా ముగించిన భారత జట్టు 2025కు ఘనంగా వీడ్కోలు పలికింది. తదుపరి టీ20 ప్రపంచకప్ లక్ష్యం సాగుతున్న భారత క్రికెటర్లు కొత్త ఏడాది రోజున దైవదర్శనంతో తన్మయం చెందారు. మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని ప్రసిద్ధ మహాకాలేశ్వరుడి ఆలయాన్ని స్మృతి మంధానతో కూడిన బృందం దర్శించుకుంది. మంధానతో పాటు రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్, స్నేహ్ రానా ఉన్నారు.



సికందర్ రాజా ఇంట్లో తీవ్ర విషాదం

జింబాబ్వే క్రికెటర్, ఆ దేశ టీ20 కెప్టెన్ సికందర్ రాజా ఇంట్లో తీవ్ర విషాదం నెలకొన్నది. సికందర్ రాజా సోదరుడు మహమ్మద్ మహది 13 ఏళ్ల వయసులోనే మృతిచెందాడు. సికందర్ సోదరుడి మృతి పట్ల జింబాబ్వే క్రికెట్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు చేసింది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డిసెంబర్ 29వ తేదీన హరారేలో మహది తుదిశ్వాస విడిచాడు. పుట్టుకతోనే హిమోఫిలియా వ్యాధితో మహది బాధపడుతున్నాడు. ఇటీవల అతని ఆరోగ్యం మరీ క్షీణించింది. వారెన్ హిల్స్ సిమెట్రీలో డిసెంబర్ 30వ తేదీన అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సికందర్ రాజా కుటుంబానికి జింబాబ్వే క్రికెటర్లు, మేనేజ్మెంట్ సంఘీభావం తెలిపింది.



'స్పిరిట్' పవర్ఫుల్ ఫస్ట్ లుక్

రెబల్ స్టార్ ప్రభాస్, హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్‌లను అందించిన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' లో తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్ లో కనిపించబోతున్నారు. మేకర్స్ కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒక ఒక పవర్ ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇది నిమిషాల్లో వైరల్ గా మారింది 'ఇండియన్ సినిమా.... మీ అజానుబాహుడును చూడండి. నూతన సంవత్సర శుభాకాంక్షలు 2026 . #స్పిరిట్ ఫస్ట్ లుక్" అని సందీప్ రెడ్డి వంగా ట్వీట్ చేశారు. ఒళ్లంతా గాయాలతో, బ్యాండ్‌ఎయిడ్‌లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడి వున్న రా అండ్ రస్టిక్ పోస్టర్ అదిరిపోయింది. పొడవాటి జుట్టు, గడ్డం పాత్ర ఇంటన్సిటీ ని మరింత పెంచుతోంది. చేతిలో మద్యం సీసా పట్టుకుని ఉన్న ప్రభాస్ లుక్ ఇంటర్నల్ కాన్ఫ్లిక్ట్ ని తెలియజేస్తోంది. అతని పక్కన ఉన్న త్రిప్తి డిమ్రీ ఒక ఎమోషనల్ మూమెంట్ లో అతని సిగరెట్ ను వెలిగిస్తూ కనిపించడం మరింత ఆసక్తిని పెంచింది. ఈ ఫస్ట్ లుక్, ప్రభాస్ పోషిస్తున్న పాత్రను ఇంటన్సిటీ, పవర్ ని తెలియజేస్తోంది. హింస, అంతర్గత సంఘర్షణ చుట్టూ తిరిగే ఒక ఫెరోషియస్ కథను ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ ప్రారంభ దశలో ఉంది, ప్రభాస్ ఇప్పటికే తన ఎక్సయిట్మెంట్ ఎక్స్ ప్రెస్ చేయడంతో ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెరిగాయి.




మీసాల పిల్ల .. 100 మిలియన్ వ్యూస్

మెగాస్టార్ చిరంజీవి-హిట్ మిషన్ అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' అదే విషయాన్ని నిరూపించింది. ఇప్పటికే ఈ చిత్రం తన చార్ట్‌బస్టర్ మ్యూజికల్ ఆల్బమ్ తో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల ఇప్పుడు అధికారికంగా 100 మిలియన్ల వ్యూస్ మార్కును దాటింది, 2025లో బిగ్గెస్ట్ తెలుగు చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన 'మీసాల పిల్ల'లో నోస్టాల్జిక్ ఫీల్‌కు మోడ్రన్ ఎనర్జీని అద్భుతంగా మేళవించారు. మెగాస్టార్ చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్. ఆయన స్టైల్, గ్రేస్, సిగ్నేచర్ డాన్స్ మూమెంట్స్ అభిమానులని మెస్మరైజ్ చేశాయి. ఇదే జోరును కొనసాగిస్తూ విడుదలైన రెండో సింగిల్ 'శశిరేఖ' కూడా వేగంగా 35 మిలియన్ వ్యూస్ దాటింది. తాజాగా విడుదలైన మూడో సింగిల్ 'మెగా విక్టరీ మాస్' హైప్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. చిరంజీవి, వెంకటేశ్ కలిసి స్క్రీన్ షేర్ చేసిన ఈ హైవోల్టేజ్ సాంగ్ విడుదలైన రోజే వైరల్‌గా మారి, ప్లేలిస్టులు, రీల్స్, ఫెస్టివల్ సెలబ్రేషన్స్‌ను షేక్ చేస్తోంది. ఇప్పటికే ఈ పాట దాదాపు 8 మిలియన్ వ్యూస్ సొంతం చేసుకుని, న్యూ ఇయర్, సంక్రాంతి వేడుకలకు ఫేవరెట్ నంబర్‌గా మారింది.

విశ్వక్ సేన్ 'లెగసీ'

ఒకే తరహా సినిమాలు చేయకుండా విభిన్న పాత్రలు, భిన్నమైన కథలతో ముందుకెళ్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు మాస్ కా దాస్ విశ్వక్ సేన్. ఎక్కువ సినిమాలు చేయడం కంటే, నాణ్యమైన సినిమాలు చేయడానికి ప్రాధాన్యతను ఇస్తూ.. ఉత్తమ వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అదే ఆయనకు ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించి పెట్టింది. "మినిమమ్ క్వాలిటీ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ" హీరో అనే పేరు కూడా తెచ్చి పెట్టింది. ఇప్పుడు ఆయన, సాయి కిరణ్ దైదా దర్శకత్వం వహించిన విమర్శకుల ప్రశంసలు పొందిన 'పిండం' చిత్రాన్ని నిర్మించిన కలాహీ మీడియా పతాకంపై తెరకెక్కుతోన్న రెండవ సినిమాలో నటిస్తున్నారు. 'లెగసీ' అనే టైటిల్ తో రూపొందుతోన్న ఈ చిత్రానికి కూడా 'పిండం' సినిమాతో తన ప్రతిభను చాటుకున్న సాయి కిరణ్ దైదా రచన, దర్శకత్వం వహిస్తున్నారు. నూతన సంవత్సర సందర్భంగా, 2026 జనవరి 1న ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ, అద్భుతమైన టీజర్ ను విడుదల చేసింది చిత్ర బృందం. 'లెగసీ' ఒక రాజకీయ నేపథ్యంతో సాగే కథ. అత్యంత ప్రభావవంతమైన రాజకీయ నాయకుడైన తన తండ్రి వారసత్వాన్ని అనివార్యంగా మోయవలసి వచ్చే సిద్ధార్థ్ అనే యువకుడి కథగా ఇది రూపొందుతోంది. వారసుడు లేని కుర్చీ చుట్టూ తిరిగే అవకాశవాద రాజకీయ రాబందులను తాను ఎంతగా ద్వేషిస్తాడో చెప్పే విశ్వక్ సేన్ వాయిస్ ఓవర్ తో టీజర్ ప్రారంభమవుతుంది. పిండం వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రం తర్వాత, దర్శకుడు సాయి కిరణ్ దైదా ఒక ఉత్కంఠభరితమైన పొలిటికల్ డ్రామాకి ప్రాణం పోసేందుకు సిద్ధమయ్యారు. టీజర్ లోని విజువల్స్ ఆయన సాంకేతిక మరియు కళాత్మక నైపుణ్యాన్ని స్పష్టం చేశాయి. నిర్మాతలు యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ రెడ్డి దైదా నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. సంజయ్ సాంబ్రాణి, వి.వి.ఎన్. ప్రసాద్ ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



న్యూ ఇయర్ స్పెషల్ పోస్టర్లు















సమ్మర్‌లో 'ది బ్లాక్ గోల్డ్'

అద్భుతమైన నటనతో ఆకట్టుకునే సంయుక్త తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలవనున్న పాన్‌ఇండియన్ యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్' లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మాగంటి పిక్చర్స్ భాగస్వామ్యంతో హాస్య మూవీస్ బ్యానర్‌పై రజేష్ దండా నిర్మిస్తున్నారు. పవర్ ఫుల్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'ది బ్లాక్ గోల్డ్' చిత్రంలో సంయుక్త ఇంటెన్స్ పోలీస్ ఆఫీసర్ లో పాత్రలో మునుపెన్నడూ చూడని విధంగా కనిపించనున్నారు. చిత్ర బృందం నూతన సంవత్సరం సందర్భంగా ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది, ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. వరుస విజయాలు, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌లను అందించిన నిర్మాత రజేష్ దండా, ఈ పాన్‌ఇండియా యాక్షన్ విజువల్‌తో ఒక కొత్త జోన్ లో అడుగుపెడుతున్నారు. 'కెరాంప్' విజయం తర్వాత, ఆయన నిర్మిస్తున్న భారీ స్థాయి యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్'. ఇప్పటికే ట్రేడ్ వర్గాలలో, సినీ ప్రేక్షకులలో బలమైన బజ్‌ను సృష్టిస్తోంది. చిత్రీకరణ దాదాపు పూర్తి కావచ్చింది, సుమారు 75% షూటింగ్ పూర్తయింది. కేవలం 15 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి. ఈ చిత్రంలో సరికొత్త కథన విధానం, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు, ఊహించని మలుపులతో ఉండబోతోంది. ఈ చిత్రాన్ని 2026 వేసవిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200